PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి.....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 204, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, సోమవారం - 14 - సెప్టెంబర్ - 2026 , వెల రూ.5/-

## రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు: జగన్ కు నారా లోకేశ్ హితవు



2లో

- డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై జగన్ ఆరోపణలకు మంత్రి లోకేశ్ కౌంటర్
- రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానిస్తున్నారని విమర్శ
- బాక్సర్ పెద్ద అప్పలరాజు నేషనల్ ఛాంపియన్ అని వెల్లడి
- ఆధారంగా సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన లోకేశ్

# పంచ సూత్రాల రాజధానిగా అమరావతి

## వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన కేంద్రం

- ★అమరావతిలో క్వాంటమ్ బయో వ్యాలీ
- ★జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్
- ★ఆరోగ్య, సుసంపన్న ఆంధ్రప్రదేశ్ కోసం ఎన్డీయే
- ★'ఎక్స్'లో నడ్డాకు సీఎం కృతజ్ఞతలు



అమరావతి: అమరావతి గురించి లద్దాఖ్‌లోనూ ప్రస్తావనకు వచ్చింది. భవిష్యత్తులో ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించి చర్చించుకునే రోజు వస్తుంది. పంచ సూత్రాల రాజధానిగా అమరావతిని ప్రపంచంలోనే ప్రత్యేక నగరంగా, భవిష్యత్తు సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. నో పోల్ సిటీగా.. బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, డీప్ టెక్నాలజీ సిటీగా రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నాం. యువత శారీరక శ్రమతో పాటు సాంకేతిక నైపుణ్యాలతో స్మార్ట్ వర్క్ చేసి గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి. ఏఐ రంగంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు యువతకు శిక్షణ ఇస్తున్నాం. మిగతా 2 లో



2లో

## ఉపాధ్యాయ అభ్యర్థుల కెరీర్లు మీకు అపహాస్యంగా మారాయా?

- స్కిల్ కేసులో క్లీన్‌చిట్ అని చెప్పడం దౌర్భాగ్యం
- ఏడు దశల్లో వెరిఫికేషన్ అంటే ఇదేనా చంద్రబాబూ?
- దీనిని ఏ విధంగా న్యాయమైనది, పారదర్శకమైనది అని అనగలం?
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

## అక్రమార్కులకు ముకుతాడు వేసేందుకు

# భోను సిద్ధంగా ఉంది

### 22ఏ ఉమ్మడి రాష్ట్రం నుంచే అమల్లో ఉంది.. కొత్తగా పెట్టింది కాదు

- ధరణి పేరుతో భూముల దోపిడీ
- ఫోరెన్సిక్ ఆడిట్‌లో వెలుగుచూసిన ఆధారాలు
- మేం నిషేధిత జాబితాలో ఒక్క ఎకరానూ కొత్తగా చేర్చలేదు
- ఇళ్లు నిర్మించుకుని దీర్ఘకాలికంగా ఉంటున్న వారిపై త్వరలో విధాన నిర్ణయం
- శాసనసభలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి




హైదరాబాద్: 'ధరణి పోర్టల్ పేరుతో గత పాలకులు ప్రభుత్వ భూముల దోపిడీకి పాల్పడ్డారు. నిషేధిత జాబితాలోని భూములను కొద్ది సమయంపాటు తొలగించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని తిరిగి ఆ జాబితాలో పెట్టేవారు. ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తే దోపిడీకి సంబంధించి మిగతా 2 లో

## భారత పౌరసత్వంపై గ్రోక్ సమాధానం.. ఎలాన్ మస్క్ వైరల్ కామెంట్



2లో

- భారత్‌లో స్థిరపడాలనుకున్న ఐర్లాండ్ వ్యక్తికి గ్రోక్ ఏఐ సమాధానం
- పౌరసత్వానికి 12 ఏళ్ల నివాసం తప్పనిసరి అని వెల్లడి
- ఈ సంభాషణపై 'ఇండియా ఈజ్ రియలిస్టిక్' అని స్పందించిన ఎలాన్ మస్క్

# 14న తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

## శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబు

- మంగళవారం నుంచి 23వ తేదీ వరకు కనులపండువగా నిర్వహించనుంది
- నిత్యం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహనసేవలు
- ఈ నెల 15 నుంచి 23 వరకు ఆర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్, సహస్రదీపాలంకార సేవలను తితిదే రద్దు



తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబైంది. ఈ వేడుకలను తితిదే మంగళవారం మిగతా 2 లో



2లో

## సౌదీ అరేబియాకు షాక్.. ఎర్ర సముద్ర మార్గానికి హౌతీల ముప్పు

- ఎర్ర సముద్ర తీరంలో వేగంగా బలపడుతున్న హౌతీ రెబల్స్
- కీలకమైన మోఖా పోర్టు, పెరిమ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకున్న హౌతీలు
- డ్రోన్ దాడులతో సౌదీ తూర్పు-పశ్చిమ పైప్‌లైన్ మూసివేత
- సౌదీ చమురు ఎగుమతులపై తీవ్ర ప్రభావం, తగ్గిన సరఫరా
- అంతర్జాతీయంగా 100 డాలర్లు దాటిన ముడిచమురు ధరలు



2లో

## నందిగ్రామ్‌లో పోటీ చేయండి.. మా అభ్యర్థి ఉండరు

### మమతకు రెబల్స్ ఆఫర్

- నందిగ్రామ్ ఉపఎన్నికలో మమతపై పోటీకి దూరంగా ఉంటామన్న టీఎంసీ రెబల్స్
- ఆమె పోటీ చేస్తే తమ అభ్యర్థిని నిలబెట్టబోమని స్పష్టం చేసిన తిరుగుబాటు వర్గం
- మమత కూడా అసెంబ్లీలో ఉండాలని కోరుకుంటున్నామన్న విపక్ష నేత రీతబ్రత బెనర్జీ
- సువేందు అధికారి రాజీనామాతో నందిగ్రామ్‌కు ఉపఎన్నిక

## 22ఏపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారు



2లో

- అసెంబ్లీ సాక్షిగా పొంగులేటి అబద్ధాలు
- మా మామపై మాట్లాడింది కూడా అసత్యాలే
- నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌వోసీ ఇచ్చిన భూమినే మా మామ కొన్నారు
- పొంగులేటి భూబాగోతాన్ని బయటపెడుతున్నందుకే నాపై, నా కుటుంబంపై బురదజల్లే ప్రయత్నం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



2లో

## వైసీపీలో కీలక మార్పులు.. పలువురికి కొత్త బాధ్యతలు అప్పగించిన జగన్

- వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్తల పదవుల్లో మార్పులు
- వైవీ సుబ్బారెడ్డి, అయోధ్య రామిరెడ్డిలకు కీలక బాధ్యతలు
- రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడిగా బీరక సురేంద్రబాబు
- డీఎస్సీ అభ్యర్థులకు మద్దతుగా పోరాట కమిటీ ఏర్పాటు
- న్యాయ పోరాటం కోసం ప్రత్యేకంగా లీగల్ సెల్ నియామకం

అమరావతి: వైసీపీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి

# కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్ల ఏర్పాటు

## బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తాం: సీఎం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సాధ్యమైనంత త్వరగా దశలవారీగా చెల్లిస్తా



హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డితో సమావేశమై బీసీలకు సంబంధించిన పలు సమస్యలను సీఎంకు వివరించి వినతిపత్రం మిగతా 2 లో

# సౌదీ అరేబియాకు షాక్.. ఎర్ర సముద్ర మార్గానికీ హౌతీల ముప్పు

ఢిల్లీ: సౌదీ అరేబియా తన చమురు ఎగుమతుల విషయంలో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఒకవైపు హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు, మరోవైపు ఇరాకీ మిలిటెంట్ల డ్రోన్ దాడులతో పాటు తాజాగా యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్ ఎర్ర సముద్రంలో పట్టు బిగించడం రియాద్‌ను ఇరకాటంలోకి నెట్టింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన రెండు ప్రధాన మార్గాలు ఏకకాలంలో ప్రమాదంలో పడటంతో అంతర్జాతీయ మార్కెట్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ మద్దతున్న యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఇటీవలి కాలంలో ఎర్ర సముద్ర తీరంలో వేగంగా ముందుకు సాగుతున్నారు. కొన్ని రోజుల క్రితం కీలకమైన మోఖా ఓడరేవును, బాబ్ అల్-మండబ్ జలసంధికి సమీపంలో ఉన్న పెరిమ్ ద్వీపాన్ని వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యతో ప్రపంచ చమురు, వాణిజ్య నౌకలకు అత్యంత ముఖ్యమైన బాబ్ అల్-మండబ్ జలసంధిపై వారి నియంత్రణ మరింత పెరిగింది. ఇదివరకు హర్మూజ్ జలసంధిలో సమస్యలు తలెత్తినప్పుడు, సౌదీ అరేబియా తన తూర్పు తీరంలోని చమురు క్షేత్రాల నుంచి ఎర్ర సముద్ర తీరానికి పైప్‌లైన్‌ల ద్వారా ముడి చమురును రవాణా చేసి ఎగుమతులు చేసేది. ఇప్పుడు ఆ మార్గానికే హౌతీల రూపంలో ముప్పు ఏర్పడింది. దీనికి తోడు, శుక్రవారం ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల మిలిటెంట్లు డ్రోన్లతో దాడి చేయడంతో సౌదీ తన తూర్పు-పశ్చిమ పైప్‌లైన్‌ను తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చింది. ఈ డ్రోన్ దాడులకు హౌతీలు సహకరించారని సౌదీ అధికారులు భావిస్తున్నారు. ఈ పరిణామాల కారణంగా ఆసియా దేశాలకు సౌదీ చేసే చమురు ఎగుమతులు భారీగా పడిపోయాయి. జూన్‌లో రోజుకు 34 లక్షల బ్యారెళ్లుగా ఉన్న ఎగుమతులు, ఆగస్టు నాటికి కేవలం 1.28 లక్షల బ్యారెళ్లకు పడిపోయాయి. ఈ నెలలో కాస్త కోలుకుని రోజుకు 7 లక్షల బ్యారెళ్లకు చేరాయి. ప్రస్తుత పరిస్థితుల్లో సౌదీ అరేబియా ముందున్న మార్గాలు పరిమితంగానే ఉన్నాయి. సైనిక చర్యకు దిగితే, వివాదం మరింత ముదిరి తమ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు పెరిగే ప్రమాదం ఉంది. దౌత్యపరమైన పరిష్కారానికి ప్రయత్నిస్తే ఇరాన్, హౌతీల నుంచి కఠినమైన షరతులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. మరోవైపు, ఈ విషయంలో అమెరికా మద్దతు కూడా అనిశ్చితంగానే ఉంది. పశ్చిమాసియాలో మరో యుద్ధంలో జోక్యం చేసుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుముఖంగా లేరని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్ల పైకి చేరింది. తమ దేశాన్ని రక్షించుకోవడంతో పాటు, ఎర్ర సముద్రంలో నౌకాయాన స్వేచ్ఛను కాపాడేందుకు భాగస్వామ్య దేశాలతో కలిసి పనిచేస్తామని సౌదీ అధికారులు తెలిపారు.

### భారత పౌరసత్వంపై గ్రోక్ సమాధానం..
# ఎలాన్ మస్క్ వైరల్ కామెంట్

ఢిల్లీ: ఎలాన్ మస్క్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ 'గ్రోక్' మరోసారి వార్తల్లో నిలిచింది. భారత్‌లో స్థిరపడాలనుకుంటున్న ఐర్లాండ్ పౌరుడొకరు అడిగిన ప్రశ్నకు గ్రోక్ ఇచ్చిన సమాధానం, దానికి ఎలాన్ మస్క్ జోడించిన వ్యాఖ్య ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఐర్లాండ్‌కు చెందిన ఒక వ్యక్తి తన భాగస్వామి, ఇద్దరు పిల్లలతో కలిసి ప్రస్తుతం కోల్‌కతాలో నివసిస్తున్నారు. తాను భారత్‌లోనే శాశ్వతంగా స్థిరపడాలని భావిస్తున్నట్లు పేర్కొంటూ, భారత పౌరసత్వం పొందడానికి పట్టే సమయం గురించి ఆయన గ్రోక్‌ను ప్రశ్నించారు. దీనికి గ్రోక్ స్పందిస్తూ.. భారత సహజ పౌరసత్వం పొందాలంటే కనీసం 12 ఏళ్లపాటు ఇక్కడ చట్టబద్ధంగా నివసించాలని స్పష్టం చేసింది. దరఖాస్తు చేయడానికి ముందు గడిచిన 14 ఏళ్లలో 11 ఏళ్ల పాటు భారత్‌లో ఉండాలని, దరఖాస్తుకు ముందు చివరి ఏడాది మాత్రం నిరంతరంగా దేశంలోనే నివసించాలనే నిబంధన ఉందని వివరించింది. అంతేకాకుండా, భారత్ ద్వంద్వ పౌరసత్వాన్ని అనుమతించదని, భారత పౌరసత్వం కావాలంటే ఐర్లాండ్ పౌరసత్వాన్ని వదులుకోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. పౌరసత్వం మంజూరు అనేది పూర్తిగా ప్రభుత్వ విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుందని కూడా పేర్కొంది. ఈ సంభాషణకు సంబంధించిన వీడియోను పీటర్ సెయింట్ ఓంజ్ అనే ఎక్స్ వినియోగదారుడు పంచుకోగా, దానిపై ఎలాన్ మస్క్ స్పందిస్తూ.. "×అ౦ఞు ఱం ‌తీమ్రుశ్రీఱఆఅ౨" (భారత్ వాస్తవిక దృక్పథంతో ఉంది) అని వ్యాఖ్యానించారు. మస్క్ చేసిన ఈ చిన్న వ్యాఖ్య నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. మస్క్ వ్యాఖ్యలతో నెటిజన్లు ఏకీభవిస్తూ.. "భారత్ ఎప్పటి నుంచో వాస్తవికంగానే ఉంది", "భారత్ ఒక అద్భుతమైన దేశం" అంటూ కామెంట్లతో మద్దతు తెలుపుతున్నారు.

### రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు
# జగన్ కు నారా లోకేశ్ హితవు

అమరావతి: డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గట్టిగా బదులిచ్చారు. రాజకీయ విమర్శల కోసం రాష్ట్రం గర్వించదగ్గ క్రీడాకారుడిని అవమానించడం తగదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. "పెద్ద అప్పలరాజు ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ బాక్సర్. ఆయన నేషనల్ ఛాంపియన్. ఆయన సెమీఫైనల్ వీడియోలు ఇప్పటికీ దూరదర్శన్‌లో ఉన్నాయి. రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించడం ఇప్పటికైనా ఆపండి జగన్ గారు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. తన వ్యాఖ్యలకు ఆధారంగా బాక్సర్ అప్పలరాజు ఆడుతున్న పాత వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని జగన్ ఆరోపణలు చేస్తుండడం తెలిసిందే. నిన్న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ అక్రమాలపై వెంటనే సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. క్రీడల కోటాలో జరిగిన అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని జగన్ అన్నారు. అసలు జరగని క్రీడలకు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి, కొందరికి పరీక్ష కూడా నిర్వహించకుండానే ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ఆ తప్పుడు సర్టిఫికెట్లను ధ్రువీకరించింది, నియామకాలు జరిపింది కూడా వారేనని విమర్శించారు. ఈ విషయంపై అధికారులు కూడా సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారని, సమర్పించిన స్పోర్ట్స్ సర్టిఫికెట్లు అసలైనవో కావో నిర్ధారించలేకపోతున్నారని తెలిపారు. ఈ కుంభకోణంపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎందుకు స్పందించడం లేదని జగన్ ప్రశ్నించిన నేపథ్యంలో, తాజాగా లోకేశ్ ఓ వీడియో ఆధారంతో కౌంటర్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### నందిగ్రామ్‌లో పోటీ చేయండి..
# మా అభ్యర్థి ఉండరు: మమతకు రెబల్స్ ఆఫర్

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉపఎన్నికలో మమతా బెనర్జీ పోటీ చేస్తే, తాము అభ్యర్థిని నిలబెట్టబోమని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తిరుగుబాటు వర్గం ప్రకటించింది. "మేము కూడా మమతా బెనర్జీ అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నాము" అని రెబల్ వర్గం నేత, విపక్ష నాయకుడు రీతబ్రత బెనర్జీ పేర్కొన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేత సువేందు అధికారి భవానీపూర్, నందిగ్రామ్ రెండు స్థానాల్లోనూ గెలిచారు. భవానీపూర్‌లో మమతా బెనర్జీని ఓడించిన ఆయన, నందిగ్రామ్ స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల తర్వాత టీఎంసీలో ఏర్పడిన విభేదాలతో పలువురు ఎమ్మెల్యేలు రీతబ్రత బెనర్జీ నాయకత్వంలో తిరుగుబాటు వర్గంగా ఏర్పడ్డారు. శనివారం ఢిల్లీలో ఎన్నికల సంఘం అధికారులతో భేటీ అనంతరం రీతబ్రత బెనర్జీ మీడియాతో మాట్లాడారు. తమ అభ్యర్థిని దాదాపు ఖరారు చేసుకున్నప్పటికీ, మమత పోటీ చేస్తే మాత్రం నిలబెట్టబోమని స్పష్టం చేశారు. "మమతా బెనర్జీ సాధారణ ఎన్నికల్లో గెలవరు, కానీ ఉపఎన్నికల్లో గెలుస్తారు. సొంత ప్రాంతంలో ఆమె ఓడిపోవడం బాగుండదు" అని వ్యాఖ్యానించారు. మరో రెబల్ నేత అఖ్రుజ్జమాన్ మాట్లాడుతూ "నందీగ్రామ్‌కు రండి. మేము అభ్యర్థిని నిలబెట్టం. గెలిచి అసెంబ్లీకి రండి. అభివృద్ధికి కలిసి పనిచేద్దాం" అని మమతకు పిలుపునిచ్చారు. అయితే, టీఎంసీ పార్టీ పేరు, గుర్తు కోసం ఈ రెండు వర్గాల మధ్య వివాదం ఎన్నికల సంఘం వద్ద కొనసాగుతోంది. ఈ ఆఫర్‌పై మమతా బెనర్జీ ఇంకా స్పందించలేదు. నందిగ్రామ్, రెజీనగర్ స్థానాలకు అక్టోబర్ 6న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 9న ఫలితాలు వెలువడనున్నాయి. నామినేషన్ల దాఖలుకు సెప్టెంబర్ 16 చివరి తేదీ.

### వైసీపీలో కీలక మార్పులు..
# పలువురికి కొత్త బాధ్యతలు అప్పగించిన జగన్



అమరావతి: వైసీపీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పలువురు నేతలకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ప్రధానంగా ప్రాంతీయ సమన్వయకర్తల (రీజనల్ కోఆర్డినేటర్ల) నియామకాల్లో ఈ మార్పులు జరిగాయి. తాజా మార్పుల ప్రకారం.. ఎంపీ వై.వి. సుబ్బారెడ్డిని ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ సమన్వయకర్తగా నియమించారు. గతంలో ఆయన కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతలను పర్యవేక్షించేవారు. మరో ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డికి ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి ప్రకాశం జిల్లాల సమన్వయ బాధ్యతలను అప్పగించారు. ఇక మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఉమ్మడి నెల్లూరు జిల్లా బాధ్యతలకు పరిమితం చేశారు. ఇదే క్రమంలో బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గానికి చెందిన బీరక సురేంద్రబాబును రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడిగా నియమించారు. వీటితో పాటు డీఎస్సీ-2025లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న అభ్యర్థులకు అండగా నిలిచేందుకు ఒక పోరాట కమిటీని, న్యాయపోరాటం కోసం లీగల్ సెల్‌ను కూడా జగన్ ఏర్పాటు చేశారు. డీఎస్సీ పోరాట కమిటీలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, తమడం కల్పలత, పానుగంటి చైతన్య, రవిచంద్ర ఉండగా.. లీగల్ సెల్‌లో పొన్నవోలు సుధాకర్ రెడ్డి, మలసాని మనోహర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, జీవీఎస్ కిషోర్‌లను సభ్యులుగా నియమించారు.

# అక్రమార్కులకు ముకుతాడు వేసేందుకు బోను సిద్ధంగా ఉంది

హైదరాబాద్: 'ధరణి పోర్టల్ పేరుతో గత పాలకులు ప్రభుత్వ భూముల దోపిడీకి పాల్పడ్డారు. నిషేధిత జాబితాలోని భూములను కొద్ది సమయంపాటు తొలగించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని తిరిగి ఆ జాబితాలో పెట్టేవారు. ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తే దోపిడీకి సంబంధించి భయంకరమైన ఆధారాలు దొరికాయి. 13 వేల ఖాతాలకు 23 లక్షల ఎకరాల ఆస్తిని బదిలీ చేసినట్లు వెలుగు చూసింది' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఏపీ నుంచే నిషేధిత జాబితా(22ఏ) అమల్లో ఉందని.. భారాస పాలకులు పదేళ్లలో ఆ జాబితాలో ఉన్న పేదల భూములు తొలగించలేదని విమర్శించారు. హైకోర్టు ఆదేశాలతోనే 2025లో ప్రభుత్వం 22ఏ జాబితాను అప్‌లోడ్ చేసిందని.. న్యాయస్థానం 45 రోజుల సమయమే ఇవ్వడంతో ధరణి, అంతకుముందు నవీకరించని జాబితానే కలెక్టర్లు అప్‌లోడ్ చేయడంతో సమస్య ఏర్పడిందని చెప్పారు. ఆ పొరపాటును సరిదిద్దామన్నారు. శాసనసభలో శనివారం 22ఏ అంశంపై జరిగిన చర్చలో ఆయన 3 గంటల 47 నిమిషాలపాటు ప్రసంగించారు. ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్టులోని వివరాలను సభ ముందుంచారు. హరీశ్‌రావు, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు దుష్ప్రచారం చేశారంటూ వీడియో క్లిప్పింగ్స్‌ను సభలో ప్రదర్శించారు. మంత్రి ఏమన్నారంటే.. 'ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌ను 1999లో రిజిస్ట్రేషన్ చేయడంతో నాటి ప్రభుత్వం 22ఏ చట్టం అమల్లోకి తెచ్చింది. 2015న ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 22ఏలో ఏ నుంచి ఈ వరకు సబ్ సెక్షన్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. 2025లోనూ ధర్మాసనం ఆదేశించి 45 రోజుల గడువు ఇచ్చింది. తక్కువ సమయం ఉండటంతో పాత డేటా అప్‌లోడ్ అయింది. దీంతో సమస్యలు రాగా సరిదిద్దాం. విలువైన ఆస్తులను ఎలా కొల్లగొట్టవచ్చో మాస్టర్ స్కెచ్ వేసి ధరణి తీసుకొచ్చారు. వారి తొత్తైన టెరాసిస్ అనే విదేశీ సంస్థకు 2.49 కోట్ల ఎకరాల భూములను తాకట్టు పెట్టారు. ఆ సంస్థ నుంచి భూములు మరో సంస్థకు బదిలీ అయ్యాయి. అర్ధరాత్రి రిజిస్ట్రేషన్లు చేశారు. అందుకే 2024 డిసెంబరు 1న భూ భారతిని ఎన్ఐసీకి అప్పగించాం. ఇప్పటికీ టెర్రాసిస్ నిర్వాహకులు భూ భారతిలోకి రెండుసార్లు ప్రవేశించారు. మొదటిసారి రిజిస్ట్రేషన్ ఫీజులు దారిమళ్లించారు. ఎస్ఈటీ ఏర్పాటుకు ముందు భూ భారతిలో ప్రవేశించి 50 ఎకరాల ఎసైన్డ్ భూములు బదిలీ చేశారు. దానిని గుర్తించాం. రాష్ట్రంలో అధికారం కోల్పోయినా వారే అధికారంలో ఉన్నట్లు పేదల ఆస్తులను కొల్లగొట్టాలని చూస్తున్నారు. అటువంటి ఆలోచనలు మానుకోండి. లేదంటే ఫలితాలు కొద్ది రోజుల్లో అనుభవిస్తారని హెచ్చరిస్తున్నాం. హైదరాబాద్‌లో సీఎస్ 7, 13, 14లకు సంబంధించి హరీశ్‌రావు వక్రీకరించి మాట్లాడుతున్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైదర్‌నగర్‌లో 145, 163 సర్వే నంబర్లను జాబితా నుంచి తొలగించాలని సీఎంను కోరారు. ఆ భూములు ఉమ్మడి ఏపీ నుంచే జాబితాలో ఉన్నాయి. ఖరీదైన ఈ భూముల రుచి చూసిన ఓ పెద్ద మనిషి గతంలో ఒక బెంజ్‌కారు పొందారు. మనిషి రక్తం రుచిచూసిన పులిలా.. అదే ధ్యాసలో ఉన్నారు. కానీ, రేవంత్‌రెడ్డి అనే బోను ఉందని మర్చిపోయారు. ముకుతాడు వేసి కట్టేస్తాడని తెలిసి నిద్రపట్టని రాత్రులు గడుపుతున్నారు. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ జటిలమైన ఇలాంటి సమస్యలు ఎందుకు పరిష్కరించలేదు. ధరణిలో లావాదేవీలకు, తొలగింపు భూములకు లెక్కా పత్రం లేదు. భూ భారతిలో పక్కా లెక్కలు ఉన్నాయి. వారి పాలనలో 22ఏ నుంచి తొలగించిన 23 వేల ఎకరాలకు పత్రాలు లేవు. రాష్ట్రంలో ఎసైన్డ్, యూఎల్‌సీ తదితర భూముల్లో నివాసాలు ఉన్న ప్రాంతాలపై త్వరలో ఒక విధానపరమైన నిర్ణయం తీసుకునే దిశగా ఆలోచన చేస్తున్నాం. భువనగిరి, మంచిర్యాలలో ఏళ్ల నుంచి ఎసైన్డ్ భూముల్లో ఇళ్లున్నాయి. ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగానూ ఉన్నాయి. మేం నిషేధిత జాబితాలో కొత్తగా ఒక్క ఎకరా చేర్చలేదు. ఎసైన్డ్, యూఎల్‌సీ సమస్యలపై విధాన పరమైన నిర్ణయం తీసుకుంటాం. ప్రజాధనంతో ఇన్నేళ్లు అధికారం అనుభవించిన వాళ్లు ప్రజల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారు. మీరు కదా రాజీనామా చేయాల్సింది. నేను ప్రతి నెలా ఒక్క రూపాయి జీతం మాత్రమే తీసుకుంటూ పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, టవర్స్ నిర్మాణంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్నా. నన్ను రాజీనామా చేయాలంటారా? ఇప్పటి వరకు రూ.21 కోట్లు తీసుకుని సభకు మొహం చాటేసిన కేసీఆర్ చేయాలి. అధికారంలో ఉంటే అవినీతి, ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్ వ్యవహారం మీది' అని మంత్రి పొంగులేటి విరుచుకుపడ్డారు.

# పంచ సూత్రాల రాజధానిగా అమరావతి

అమరావతి: అమరావతి గురించి లద్దాఖ్‌లోనూ ప్రస్తావనకు వచ్చింది. భవిష్యత్తులో ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించి చర్చించుకునే రోజు వస్తుంది. పంచ సూత్రాల రాజధానిగా అమరావతిని ప్రపంచంలోనే ప్రత్యేక నగరంగా, భవిష్యత్తు సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. నో పోల్ సిటీగా.. బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, డీప్ టెక్నాలజీ సిటీగా రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నాం. యువత శారీరక శ్రమతో పాటు సాంకేతిక నైపుణ్యాలతో స్మార్ట్ వర్క్ చేసి గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి. ఏఐ రంగంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు యువతకు శిక్షణ ఇస్తున్నాం.

దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక సాంకేతికత, జీవశాస్త్ర పరిశోధనల కలయికతో 'అమరావతి క్వాంటమ్ బయో వ్యాలీ'ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్ర రాజధానిలో ఏర్పాటు చేయబోయే ఈ ప్రాజెక్ట్ దేశ ఆరోగ్య, పరిశోధనా రంగానికి సరికొత్త దిక్సూచిగా మారనుందని తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, ప్రయోగశాలల ఆటోమేషన్, ఎక్స్‌పెరిమెంటల్ బయాలజీలను ఒకే వేదికపైకి తేవడమే ఈ క్వాంటమ్ బయో వ్యాలీ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. దీన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని కేంద్రాన్ని కోరారు. ప్రపంచ బయో ఎకానమీలో 111 మిలియన్ డాలర్ల వాటాతో ఆంధ్రప్రదేశ్ టాప్ 5లో ఉందని.. రాబోయే పదేళ్లలో గ్లోబల్ బయో ఎకానమీ పవర్‌హౌస్‌గా మారుతుందని చెప్పారు. విజయవాడలో జరిగిన క్రిటికల్ కేర్ బ్లాకులు, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ముఖ్యాంశాలివీ.. 'రూ.249 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాకులు, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీల ప్రారంభంతో అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యం మరింత చేరువవుతుంది. ఈ ప్రాజెక్టులతో రాష్ట్రంలో 500 క్రిటికల్ కేర్ బెడ్లు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్ సదుపాయాలతో పాటు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ వంటి కీలక వైద్య విభాగాల సేవలు అందుబాటులోకి వచ్చాయి.

కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. దేశంలో వైద్యవిద్య సీట్లను 51 వేల నుంచి రెండింతలకు పైగా పెంచారు. కొవిడ్ సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన ఘనత భారతదేశానికి, ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుంది. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు మందులు అందుతున్నాయి. ఆయుష్మాన్‌భారత్ కార్డుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఫార్మా రంగానికి ఏపీ చిరునామాగా మారింది. మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాం. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ 1గా నిలుపుతాం.

## స్మార్ట్ వర్క్‌తో ఒత్తిడి దూరం

వంట గదినే ఫార్మసీగా.. ఆహారాన్నే ఔషధంగా మార్చుకోవాలి. యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటివి నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి. ఒత్తిడిని దూరం చేసుకుని స్మార్ట్ వర్క్ చేయాలి. సంప్రదాయ ఆరోగ్య విధానాలను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే వైద్యారోగ్య రంగంలో మరింత మెరుగైన సేవలు అందించగలం. రాష్ట్ర వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాలకు కృతజ్ఞతలు. నడ్డా నాయకత్వంలో దేశప్రజల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందన్న నమ్మకం ఉంది.

రామాయణంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవని పర్వతాన్నే తీసుకొచ్చినట్లు.. పేదల ముంగిటకే అంతర్జాతీయ వైద్య పరిజ్ఞానాన్ని సంజీవని రూపంలో తెస్తున్నాం. జనవరి 1 నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తాం. వ్యాధుల ముందస్తు అంచనా, నివారణ, చికిత్స, వైద్య ఖర్చులు తగ్గించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

అమరావతి క్వాంటమ్ బయో వ్యాలీ ప్రాజెక్టుకు పూర్తి మద్దతు ఇస్తామని, సంజీవని ఆరోగ్య కార్యక్రమం దేశవ్యాప్తంగా అమలు చేసే అంశం పరిశీలిస్తామని ప్రకటించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ధన్యవాదాలు తెలిపారు. 'రాష్ట్రవ్యాప్తంగా 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు ప్రారంభించేందుకు విజయవాడలో మాతో కలిసినందుకు ధన్యవాదాలు. ప్రధాని మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ ఎన్డీయే ప్రభుత్వం ఆరోగ్య, సుసంపన్న ఆంధ్రప్రదేశ్ కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది' అని పేర్కొన్నారు.

### 22ఏపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
# పచ్చి అబద్ధాలు మాట్లాడారు



హైదరాబాద్: అసెంబ్లీ సాక్షిగా 22ఏపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని అసెంబ్లీలో భారాస డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ టి.హరీశ్‌రావు విమర్శించారు. మంత్రి, ఆయన కుమారుడు చేస్తున్న భూబాగోతాలను ఒక్కొక్కటిగా బయటపెడుతున్నాననే కక్షతో.. తనపై, తన కుటుంబ సభ్యులపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ భవన్‌లో శనివారం రాత్రి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొందరపడి నిషేధిత జాబితాలో పెట్టిన ఇళ్లను, భూములను ఎంత వేగంగా ఆ జాబితా నుంచి తొలగిస్తారో మంత్రి సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. "22ఏ విషయంలో తప్పు జరిగిందని పొంగులేటి అసెంబ్లీలో అంగీకరించారు... అది అభినందనీయమే. ఆయన క్షమాపణ చెబుతారని ప్రజల ఆశించారు. ఇదంతా తమ హయాంలో జరగలేదు.. గతంలోనే నిషేధిత జాబితాలో ఉందని బుకాయించే ప్రయత్నం చేశారు. గతంలో సమస్య ఉంటే.. అప్పుడెందుకు రిజిస్ట్రేషన్లు ఆగలేదు... ఇప్పుడు ఎందుకు ఆగాయి? ప్రజలు ఎందుకు రోడ్ల మీదకు వచ్చారు? తప్పే జరగకపోతే.. మీరెందుకు ఇటీవల సారీ చెప్పారు? అధికారుల మీదకు నెట్టేసే ప్రయత్నం ఎందుకు చేశారు? భూభారతి వెబ్‌సైట్‌లోకి ఎవరో ప్రవేశించారని.. ఎసైన్డ్ భూములు, పట్టా భూములు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు అయిపోతున్నాయని మీరు అంగీకరించారు. భూభారతిని అత్యంత పకడ్బందీగా రూపొందిస్తే అలా ఎలా జరుగుతుంది? రిజిస్ట్రేషన్ చలాన్లలో అవకతవకలను బయటపెట్టిందే భారాస. ఆ స్కాంలో అధికారుల మీద చర్యలు తీసుకోకుండా ఆపరేటర్లపై తీసుకొని మిన్నకుండిపోయారు" అని హరీశ్ అన్నారు. "మా మామ ఒక భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. అది అవాస్తవం. ఆయన ఒక రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి. ఒక రిటైర్డ్ ఆర్మీ అధికారికి 1995లో అప్పటి ప్రభుత్వం భూమి కేటాయించింది. 2010లో కాంగ్రెస్ సర్కారు హయాంలోనే ఆ భూమికి ఎన్‌వోసీ ఇచ్చింది. దాని ఆధారంగా ఆ భూమిని మా మామ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ భూమి ఇప్పుడు ఎకరం రూ.15 కోట్లు ఉంటుందంటున్నారు మంత్రి... రూ.50 లక్షలకు ఇస్తాం రిజిస్ట్రేషన్ చేసుకోండి" అని హరీశ్ అన్నారు. "పొంగులేటి మాపై మరో అబద్ధం చెప్పారు. మా భూమి మిషన్ భగీరథలో పోతే.. డబ్బులు తీసుకున్నానన్నారు. కానీ ఆ భూమి గోదావరి సుజల స్రవంతి పథకంలో భాగంగా పోయింది. చెక్ ఇచ్చింది కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే. 2011లో మ్యుటేషన్ కూడా జరిగింది" అని వివరించారు.

# 14న తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబైంది. ఈ వేడుకలను తితిదే మంగళవారం నుంచి 23వ తేదీ వరకు కనులపండువగా నిర్వహించనుంది. సోమవారం సాయంత్రం శ్రీనివాసుడి సేనాధిపతి విష్వక్సేనుడు ఆలయ పరిసరాల్లో, తిరువీధుల్లో విహరించి ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. అదేరోజు వేదపండితులు, అర్చకుల మంత్రోచ్చారణ నడుమ భూమిపూజ చేసి, పుట్టమట్టి సేకరించి, యాగశాలలోని కొత్తపాలికల్లో నవధాన్యాలు పోసి అంకురార్పణ చేయనున్నారు. మంగళవారం సాయంత్రం ధ్వజారోహణం అనంతరం స్వామివారు పెద్దశేష వాహనంపై తిరువీధుల్లో విహరిస్తారు. నిత్యం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహనసేవలు నిర్వహించనున్నారు. 19న రాత్రి గరుడ సేవను అర్ధరాత్రి వరకూ కొనసాగిస్తారు. 20న సాయంత్రం స్వర్ణ రథోత్సవం, 22న ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనంతో వాహనసేవలు ముగియనున్నాయి. 23న ఉదయం 6 గంటల నుంచి పుష్కరిణిలో చక్రస్నానం ఉంటుంది. బ్రహ్మోత్సవాల దృష్ట్యా ఈ నెల 15 నుంచి 23 వరకు ఆర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్, సహస్రదీపాలంకార సేవలను తితిదే రద్దుచేసింది. వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రొటోకాల్ పరిధిలో ఉండి, స్వయంగా వచ్చేవారికి పరిమితం చేసింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్‌ఆర్‌ఐలు, దాతలకు ప్రత్యేక దర్శనాలను రద్దు చేసింది.

## గవర్నర్‌కు తితిదే ఆహ్వానం

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు రావాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు తితిదే ఆహ్వానం పలికింది. ఈవో ముద్దాడ రవిచంద్ర, వేద పండితుల బృందం శనివారం విజయవాడలోని లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలసి బ్రహ్మోత్సవాల వివరాలను తెలిపింది. ఆహ్వాన పత్రికను గవర్నర్‌కు ఈవో అందజేశారు. వేద పండితులు వేదాశీర్వచనం ఇచ్చారు.

# కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్ల ఏర్పాటు



హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డితో సమావేశమై బీసీలకు సంబంధించిన పలు సమస్యలను సీఎంకు వివరించి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని కోరగా ఈ అంశంపై సీఎం సానుకూలంగా స్పందించారని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని బీసీ సంక్షేమ శాఖను ఆదేశించినట్లు చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో, పలు జిల్లా కేంద్రాల్లో బీసీ విద్యార్థులకు హాస్టళ్లలో సీట్లు సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో 100 బీసీ కాలేజీ హాస్టళ్లు, 120 బీసీ గురుకులాలు మంజూరు చేయాలని ,హాస్టల్ విద్యార్థుల కోసం శాశ్వత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేయగా కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదేశించారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సాధ్యమైనంత త్వరగా దశలవారీగా చెల్లిస్తామని చెప్పారన్నారు. సీఎంను కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు జి.మల్లేష్‌యాదవ్, నీలా వెంకటేష్, జిల్లపల్లి అంజి, సి.రాజేందర్, పర్లగోర్ల మోడీ రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ అభ్యర్థుల కెరీర్లు మీకు అపహాస్యంగా మారాయా?



అమరావతి: డీఎస్సీ నియామక ప్రక్రియలో ఏడు దశల వెరిఫికేషన్ అంటే ఇదేనా చంద్రబాబు అంటూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రశ్నించారు. ఏపీ మెగా డీఎస్సీ స్కామ్‌పై ఆయన మరోసారి 'ఎక్స్' వేదికగా చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. 'వెరిఫికేషన్.. నో, నో.. ఏడు దశల వెరిఫికేషన్' అంటూ జగన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఏడు దశలు పెట్టినా.. ఒక్కో కేసులో ఒక్కో అంశం బయటపడుతోందని చెప్పారు. వెరిఫికేషన్ పేరుతో అసలేం సాధించారంటూ నిలదీశారు. ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుతో చంద్రబాబు సర్కారు ఆటలాడుతోందని అన్నారు. ఉపాధ్యాయ అభ్యర్థుల కెరీర్లు మీకు అపహాస్యంగా మారాయా అని మండిపడ్డారు. 'ముందుగా విజేతల జాబితాను పరిశీలిస్తే అందులో సంబంధిత అభ్యర్థుల పేర్లు కనిపించడంలేదు. ఆ తర్వాత ఖోఖో అధికారులను సంప్రదిస్తే.. సర్టిఫికెట్ నకిలీదని తేలింది. అంతేకాకుండా నాగార్జున యూనివర్సిటీని సంప్రదిస్తే.. అసలు ఆ క్రీడా కార్యక్రమమే జరగలేదని తేలింది. ఇలాంటి పరిస్థితుల్లో డీఎస్సీ ప్రక్రియను న్యాయమైన, పారదర్శకమైన నియామక ప్రక్రియగా ఎలా పిలుస్తారు? ఇది స్కామ్ కాదా? దీనికి మీరు నైతిక బాధ్యత వహించరెందుకు' అని వైఎస్ జగన్ సీఎం చంద్రబాబుని నిలదీశారు.

స్కిల్ కేసులో క్లీన్‌చిట్ అని చెప్పడం దౌర్భాగ్యం

చంద్రబాబు చేసిన స్కామ్‌లో ఆయనే సొంతంగా క్లీన్ చిట్ ఇప్పించుకుని భుజాలు ఎగరేసుకుయిటున్నారని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఆయన శనివారం ఫేస్‌బుక్‌లో ఈమేరకు ఒక పోస్టు చేశారు. 'అధికారులను బెదిరించి తనపై ఉన్న కేసుల పని పూర్తి చేసుకుని క్లీన్‌చిట్ అని చెప్పడం దౌర్భాగ్యం. తన మీద కేసులు తానే కొట్టేయించుకుంటున్నాడు. ఎందుకంటే అవన్నీ నిజం కాబట్టి. ఇప్పుడు కూడా డీఎస్సీ కేస్‌ని నిర్వీర్యం చేసే పని చేస్తున్నాడు. అయినా స్కిల్ కేసులో తనకు క్లీన్‌చిట్ వచ్చిందని చెప్పుకోవడం ఎంతటి దౌర్భాగ్యం' అని వైఎస్ జగన్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు.

## కుప్పం పులివెందల లో కాపు బలిజకి అవకాశం ఇవ్వాలి.



నేటి శుభోదయ విజయవాడ సెప్టెంబర్ 13 కుప్పం, పులివెందుల మున్సిపల్ చైర్మన్లు గా బలిజ లకు అవకాశం కల్పించాలని కాపు పొలిటికల్ జేఏసీ చైర్మన్ వేల్పూరు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు . చంద్ర బాబు నాయుడు, జగన్ సిఎం లుగా బలిజ సామాజిక వర్గం మద్దతు వల్లే అయ్యారు అని, కాని కుప్పం, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం లలో బలిజ కాపు వర్గం మీద వివక్ష చూపుతున్నారని కాపు పొలిటికల్ జేఏసీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ చైర్మన్ వేల్పూరి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కుప్పం లో 4 మండలాలు, పులివెందుల అసెంబ్లీ లో 7 మండలాలు ఉన్నా ఒక్క చోట కూడా బలిజ కులస్థులు కి మండల ప్రజా పరిషత్, జడ్పీటీసీ సభ్యులు గా కూడా అవకాశం లేకుండా చేశారు అని పేర్కొన్నారు. బాబు, జగన్ నామినేటెడ్ పదవుల లో కూడా మొండి చేయి చూపారు అని, అన్నదమ్ములు గా ఉన్న బలిజ..కాపు కులస్థుల మధ్య విభేదాలు సృష్టించిదానికి సిఎం జగన్ కాపు కార్పొరేషన్లో ఒక్క బలిజ డైరెక్టర్ ను రాయలసీమ నుంచి నియామకం చేయలేదు అని పేర్కొన్నారు. మీకు సిఎం పదవి కావాలి, కాపులు మాత్రం కార్యకర్తలు గా ఉండాలా అని శ్రీనివాసరావు ప్రశ్నించారు.

## కొయ్యలగూడెం ప్రాంత అభివృద్ధిపై కోసమే నా ప్రయత్నం

**ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్**

**నేవీ డిపో కావాలంటూ ఎంపీ ను కలిసిన రైతులు**

**- 90 శాతం రైతులు అనుకూలంగా ఉన్నారని ఎంపీ కి తెలిపిన రైతు నేతలు**




ఏలూరు, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: ఆదివారం ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను కొయ్యలగూడెం గ్రామ రైతులు, నేతలు కలిశారు. 90 శాతం రైతులు అనుకూలంగా ఉన్నప్పటికీ భూములు లేకపోయినా ఆందోళనలు చేస్తున్న కొద్ది మంది వలన తమ ప్రాంతం అభివృద్ధికి ఆటంకం ఏర్పడటం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నేవీ డిపో ఎట్టి పరిస్థితుల్లోనూ కొయ్యలగూడెంలోనే ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రైతులు ఎంపీకి విజ్ఞప్తి చేశారు. రైతుల విజ్ఞప్తులపై స్పందించిన ఎంపీ గత ఎన్నికల్లో కొయ్యలగూడెం ప్రాంత ప్రజలు తనకు పూర్తి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నేవీ ఆయుధ డిపో వస్తే కొయ్యలగూడెం ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందనీ, వేలాదిమంది ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయనే ఉద్దేశంతో నేవీ డిపో ప్రాజెక్టు తీసుకువచ్చేందుకు తాను కృషి చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ లతో మాట్లాడి నేవీ డిపో కల సాకారమయ్యేట్లు చూస్తానని ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ రైతులకు స్పష్టం చేశారు. దీనితో పాటు గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు హోం మంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఇవే కాకుండా గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీలు, స్మశానవాటికలు వంటి అన్ని సౌకర్యాలపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఎంపీ స్పందన పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నాయకత్వంలో తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఎంపీ ను కలిసిన వారిలో కొయ్యలగూడెంకు చెందిన రైతులతో పాటు కూటమి పార్టీల నేతలు బొల్లిన నిర్మల కిశోర్, కారం భీమరాజు,చిటికన బాల గంగాధర్ తిలక్, కొల్లూరి రవి, బొమ్మ దుర్గ బాబు, గొల్లిశెట్టి శ్రీను, మద్దు మోహన్, జ్యేష్ట రామకృష్ణ, మల్లి శెట్టి రాంబాబు, చిరువూరి శ్రీను, గద్దె రాము, చెప్పుల అశోక్ కుమార్,చెరుకూరి గోపాలరావు, దుగ్గిరాల బోస్, గ్రామ రైతులు ఉన్నారు.

## "ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు



మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ డి.దేవబాబు" తాడేపల్లిగూడెం ,సెప్టెంబర్ 13 (నేటి- శుభోదయ): విఘ్నేశ్వరుని ఆశీస్సులతో తాడేపల్లిగూడెం సుభిక్షంగా ఉండాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డి.దేవ బాబు ఆకాంక్షించారు. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ నాయకులకు, అధికారులకు, ప్రజలకు, జర్నలిస్టులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి శుభాలను కలిగించే వినాయకుని పూజ ప్రకృతి సిద్ధంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ప్లాస్టిక్ తదితర రసాయనాలతో తయారుచేసిన విగ్రహాలను కాకుండా మట్టి విగ్రహాలను మాత్రమే పూజించాలని, పర్యావరణను కాపాడుకోవాలని, తద్వారా ప్రజారోగ్యాన్ని రక్షించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్న మండపాల నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని ,ప్రభుత్వ సూచనల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలి

**తాడేపల్లిగూడెంలో సీ.పీ పి హెచ్ పి అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ పై వ్యతిరేక అవగాహనా ర్యాలీ"**




తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 13 (నేటి- శుభోదయ) కమ్యూనిటీ పారామెడిక్స్ & ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (డి.ఫార్మ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) తాడేపల్లిగూడెం మరియు పెంటపాడు మండలాల యూనిట్ అధ్యక్షులు మునగాల జితేంద్ర ఆధ్వర్యంలో జాతీయ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.బి.టి. రాజు నేతృత్వంలో ఆదివారం డ్రగ్స్ వ్యతిరేక అవగాహనా కార్యక్రమం మరియు ర్యాలీ నిర్వహించారు. తాడేపల్లిగూడెం ఛత్రపతి శివాజీ సెంటర్, జి.వి. మాల్ సమీపంలో ఉదయం 09:00 గంటలకు ఏర్పాటు చేసిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహనా హోర్డింగ్ను ప్రభుత్వ విప్ మరియు తాడేపల్లిగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవనీయులు బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ఫార్మా అసోసియేషన్ సభ్యులు ప్రజలకు ఉపయోగపడే అవగాహనా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు.జాతీయ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.బి.టి. రాజు మాట్లాడుతూ, ప్రధానమంత్రి గౌరవనీయులు నరేంద్ర మోదీ పిలుపు మేరకు వికసిత భారత్ లక్ష్య సాధనలో భాగంగా 100 ఆదివారాల కార్యక్రమం ద్వారా హైస్కూల్, కళాశాల విద్యార్థులు మరియు యువతకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.అనంతరం స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ జెండా ఊపి అవగాహనా ర్యాలీని ప్రారంభించారు. సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన డ్రగ్స్ హోర్డింగ్ సమీపంలో జన విజ్ఞాన వేదిక పశ్చిమ గోదావరి జిల్లా గౌరవ సలహాదారు పత్తి వీరాస్వామి మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత సమాజం ఏర్పాటు చేయడంలో ప్రజలందరూ కీలక పాత్ర పోషించాలని, పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ నాయకులు పాల్గొని, మత్తు పదార్థాలు మరియు మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు.అనంతరం సభ్యులు పోలీస్ స్టేషన్ నుంచి పెద్ద వంతెన పోలీస్ ఐలాండ్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన హోర్డింగ్ వద్ద తాడేపల్లిగూడెం టౌన్ ఎస్.ఐ. బాదం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఫార్మా సభ్యులు డ్రగ్స్ వ్యతిరేకంగా అవగాహనా ర్యాలీ నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. యువత చేస్తున్న ప్రతి పనిని తల్లిదండ్రులు పర్యవేక్షించాలని, భారతదేశంలో డ్రగ్స్ వ్యతిరేక పోరాటాన్ని ప్రతి పౌరుడు తన బాధ్యతగా నిర్వహించాలని ఎస్.ఐ. శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఫార్మా అసోసియేషన్ సభ్యులు, పశ్చిమ గోదావరి జిల్లా బి.సి. సంఘం అధ్యక్షులు మరియు తాడేపల్లిగూడెం పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు వర్రసపల్లి కాశీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ఆరోగ్య అవగాహనా కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేలా తాము ముందుంటామని తెలిపారు. ఈ అసోసియేషన్లో సభ్యుడిగా ఉన్నందుకు గర్వంగా ఉందని అన్నారు.తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో డ్రగ్స్ అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన సమాచారాన్ని స్థానిక పోలీసులకు లేదా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయానికి తెలియజేస్తే, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తన సొంత నిధుల నుంచి ?10,000 బహుమతిగా అందజేస్తారని వర్రసపల్లి కాశీ తెలిపారు.ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు ఏ.ఆర్.కె. పరమేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహనా ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేసారు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. చిట్టి సుభాన్ మాట్లాడుతూ, ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రతి గ్రామంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం గ్రామీణ వైద్యులుగా మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు.మండల గౌరవాధ్యక్షులు ఎల్.ఎన్.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ ర్యాలీలో సభ్యులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు మండల కార్యవర్గాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఐ.వి.వి. సుబ్బారావు, కోశాధికారి కొపిని రమేష్, సహాయ కార్యదర్శి గుర్రాల దుర్గారావు , గౌరవ సలహాదారు వై. గోపాలకృష్ణ , కార్యవర్గ సభ్యులు ఎస్.కె. అజీజ్, షేక్ బాలబాజీ గారు, ఎమ్. గిరిధర్ సింగ్, ఎమ్. రాజు, పి. హరి మరియు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## అదనపు పొగాకు కొనుగోళ్ల అనుమతి కోసం ప్రయత్నిస్తా

**: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్**

**- ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను కలిసిన పొగాకు రైతులు - పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎంపీకి కృతజ్ఞతలు తెలిపిన రైతులు - అదనపు పొగాకు కొనుగోళ్లకు కేంద్రంతో మాట్లాడవలసిందిగా విజ్ఞప్తి**

**- బోర్డుతో మాట్లాడుతానని హామీ ఇచ్చిన ఎంపీ - పొగాకు రైతుల కోసం ప్రత్యేకంగా డిపిపి, యూరియా కోటా ఇవ్వాలని కోరిన రైతులు**



ఏలూరు, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: పొగాకు రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నానన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన పొగాకు రైతులు, రైతు సంఘాల నేతలు ఆదివారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను ఏలూరులోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఎన్ఎల్ఎస్ వర్జీనియా పొగాకు మార్కెట్ గత నాలుగు నెలలుగా అనేక ఒడిదుడుకులను ఎదుర్కొందని, ప్రస్తుతం మార్కెట్ ధరలు రోజురోజుకూ మెరుగుపడి ఇప్పుడు యూరప్లో పొగాకు ధర కేజీ 345 వరకూ చేరిందని చెబుతూ, ఇందు కోసం ఎంపీ చేసిన కృషిని రైతులు ప్రశంసించారు. కొద్ది రోజుల్లో పొగాకు ధర మరింతగా పెరుగుతుందన్న ఎంపీ, దీనికోసం పొగాకు బోర్డుతో, కంపెనీల ప్రతినిధులతో తాను మాట్లాడుతున్నానని తెలిపారు. అయితే రైతులు కూడా బోర్డు అనుమతి లేకుండా పొగాకు సాగు చేయవద్దని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

**అదనంగా పండిన పొగాకు అమ్మకాలకు అనుమతి**

పొగాకు బోర్డు నిర్ణయించిన కోటాకు మించి పండిన పంటను కూడా వేలం కేంద్రాల్లో విక్రయించేందుకు అనుమతి కల్పించేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారులతో చర్చించి తగిన అనుమతులు ఇప్పించవలసిందిగా రైతులు ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం పొగాకు అమ్మకాలు ప్రారంభమై సుమారు ఐదు నెలలు కావస్తోందనీ, తొలినాళ్లలో పొగాకు విక్రయించిన రైతుల కోటాలు ఇప్పటికే పూర్తయ్యాయనీ, అదనపు కోటాల కోసం అనేకమంది రైతులు ఎదురుచూస్తున్నారని రైతులు ?ఎంపీ కి విన్నవించారు. దీనిపై తప్పకుండా తాను పొగాకు బోర్డుతో, కేంద్ర మంత్రితో మాట్లాడుతానని ఎంపీ హామీ ఇచ్చారు.

**- డిపిపి , యూరియా ప్రత్యేక కోటా**

2026-27 పంట కాలానికి అవసరమైన డిపిపి, యూరియా లభించక పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులను ఈ సందర్భంగా రైతులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పొగాకు రైతులకు ప్రత్యేక కోటా ద్వారా డిపిపి , యూరియా అందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలసిందిగా రైతులు ఎంపీని కోరారు. ఈ విషయమై రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు శ్రీ కింజరపు అచ్చెన్నాయుడు తో మాట్లాడతానని హామీ ఇచ్చిన ఎంపీ, రైతులు కూడా మంత్రిని కలిసి సమస్యను వివరించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పొగాకు రైతుల సమస్యలపై స్పందిస్తూ రైతు ప్రయోజనాల కోసం కృషి చేస్తున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు ఈ సందర్భంగా రైతాంగం తరఫున పొగాకు రైతులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీ ను కలిసిన వారిలో పలువురు పొగాకు రైతులతోపాటు రైతు సంఘాల ప్రతినిధులు వెంట్రప్రగడ శ్రీనివాస్, రవి వర్మ, దుగ్గిరాల బోస్ తదితరులు ఉన్నారు.



## జిల్లాలోని ప్రజలందరికీ వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు






**ప్రజలు పర్యావరణ హిత మట్టి విగ్రహాలను పండుగలో వినియోగించండి**

అనంతపురం సెప్టెంబర్ 13 నేటి శుభోదయ : వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో పర్యావరణ హితంగా ఉత్సవాలు జరుపుకోవాలని పండుగ శుభాకాంక్షలను జిల్లా ఇంచార్జి మంత్రి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక మరియు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, శాసన మండలి సభ్యులు, ఎంఎల్ఏలు, జేసీ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ మలోల తదితరులు తెలిపారు.వినాయక చవితి ఎంతో పవిత్రమైన పండుగ అని, అన్ని విఘ్నాలను, సంకటాలను పారించి విజయాన్ని అందించే వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలందరి ఇంటా విఘ్నాలు తొలగి వారు అయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, సౌభాగ్యాలతో సిరి సంపదలతో శుభ తూగాలని సుహృద్భావ వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని, సహజ రంగులతో తయారు చేసిన మట్టి విగ్రహాలను ఉపయోగించాలని, పర్యావరణానికి హాని చేసే కృత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాలను వాడరాదని, ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడేలా మట్టి వినాయకులని ఉపయోగించాలని, సామరస్య, శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

## "కార్యకర్తలే పార్టీకి బలం.. జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

**వ్యక్తిగత విభేదాలు పక్కనపెట్టి స్థానిక పోరులో సత్తా చాటాలి**

**వైసీపీ తాడేపల్లిగూడెం రూరల్ మండల విస్తృతస్థాయి సమీక్షలో వడ్డి రఘురామ్ నాయుడు పిలుపు"**




తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 13 (నేటి శుభోదయ)వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, ప్రతి కార్యకర్తకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతానని ఆ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురామ నాయుడు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడా విభేదాలకు తావులేకుండా పార్టీ అభ్యర్థులను ఐకమత్యంతో గెలిపించి విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం మండలంలోని ఎల్ అగ్రహారంలో ఉన్న కోట్ల ఫంక్షన్ హాలులో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమీక్ష సమావేశం వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురామ నాయుడు మాట్లాడుతూ 2019–2024 మధ్య పార్టీ పరంగా జరిగిన కొన్ని తప్పులను గుర్తించి, వాటిని సరిదిద్దుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిన సమయంలో కార్యకర్తలను సరిగ్గా పట్టించుకోలేదన్న విషయం వాస్తవమేనన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణను చూసి భయపడుతోందని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రతి గ్రామంలో పార్టీ అభ్యర్థులు ధైర్యంగా పోటీ చేయాలని, ఎక్కడా విభేదాలకు అవకాశం ఇవ్వకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడాలని సూచించారు. మండలంలోని 34 గ్రామాల్లో గ్రామ కమిటీలను ఏర్పాటు చేశామని, ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. 34 గ్రామాల్లో బూత్ స్థాయి ఏజెంట్లు సమర్థంగా పనిచేసే పార్టీ ఓట్లు చెదిరిపోకుండా కృషి చేశారని అభినందించారు.

**'కార్యకర్తలకు నేనున్నాను'**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తను తాను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని రఘురామ నాయుడు భరోసా ఇచ్చారు. "వైసీపీ కార్యకర్తలే నా దేవుళ్లు. కార్యకర్త లేనిదే పార్టీ లేదు.. కార్యకర్త లేనిదే ఈ ఆరడుగుల మనిషి కూడా లేడు" అని అన్నారు. వైసీపీకి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే నాయకుడని, మిగతా వాళ్లం పాటు తాను కూడా ఒక సాధారణ కార్యకర్తనేనని చెప్పారు. ఎవరైనా కార్యకర్తలకు అన్యాయం జరిగినా, ఏ ఇబ్బంది ఎదురైనా వారి వెంట నిలబడేందుకు తాడేపల్లిగూడెంలో లీగల్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యకర్తలకు న్యాయం జరిగే వరకు కమిటీ పోరాడుతుందని చెప్పారు. పుల్లాయిగూడెంలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా పోరాడారని గుర్తుచేశారు.

**డిజిటల్ కార్డు ఉన్న ప్రతి కార్యకర్త జగన్ కుటుంబ సభ్యులే**

పార్టీ కోసం జెండా మోసిన ప్రతి కార్యకర్తకు డిజిటల్ కార్డులు అందించామని, కార్డులు పొందిన వారంతా జగన్ కుటుంబ సభ్యులేనని రఘురామ నాయుడు అన్నారు. వారి వివరాలన్నీ పార్టీ వ్యవస్థలో నమోదై ఉన్నాయని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు. జిల్లా, రాష్ట్ర కమిటీల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి అవకాశం కల్పించామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, కౌన్సిలర్, మున్సిపల్ చైర్మన్ తదితర పదవులకు పార్టీ శ్రేణులు పోటీ చేయాలని సూచించారు. గెలిచినా, ఓడినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం పోరాడిన వారి నాయకులుగా ఉంటారని చెప్పారు. జగన్ 2.0 అంటే కార్యకర్తలకు అండగా నిలవడమేనని, మనలను ఇబ్బంది పెట్టిన వారికి సినిమా చూపిద్దాం అని రఘురామ నాయుడు అన్నారు. తనది ఒకటే వర్గమని, అది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తల వర్గమని స్పష్టం చేశారు. గతంలో 151 సీట్లు ఇచ్చి ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించారని, అదే ప్రజాభిమానాన్ని తిరిగి సాధించేందుకు ప్రతి కార్యకర్త కష్టపడాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి స్థానిక పోరులో పార్టీ అభ్యర్థుల విజయానికి ఐక్యంగా పనిచేయాలని కోరారు. తాను ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ఆక్వా రైతులకు అనేక సేవలు అందించానని, ప్రస్తుతం కార్యకర్తలకు "నేనున్నాను.. నేను విన్నాను" అనే భరోసా కల్పించేందుకే జగన్‌మోహన్‌రెడ్డి తనను తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి పంపించారని తెలిపారు. టీడీపీ నియామకాల విషయంలో అక్రమాలు, అవినీతి జరిగాయని ఆరోపించిన రఘురామ నాయుడు.. క్రీడా ప్రాంగణాల అంశంపైనా విమర్శలు చేశారు. అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ లోకేష్ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని కాక్రెస్ పార్టీ అందోళనకు దిగొచ్చిన కేంద్ర మంత్రి తన పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో 'సూపర్ సిక్స్' హామీలతో ప్రజలను మభ్యపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని యువతను కూడా దారుణంగా మోసం చేశారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలు "జై జగన్.. జై రఘురామ నాయుడు" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల రూరల్ పార్టీ అధ్యక్షులు చి ట్లూరి బాపన్న, టౌన్ పార్టీ అధ్యక్షులు గొర్లె శ్రీనివాస్, గోపిశెట్టి దొరబాబు, ముప్పిడి పెద అబ్బులు రెడ్డి, రాపాక వెంకటేశ్వరరావు, కందెల్లి రాజేష్, మండలంలోని పలువురు పార్టీ నాయకులు, గ్రామ కమిటీ ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో 1000 మట్టి వినాయకుల పంపిణీ

**పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తి భావాన్ని పెంపొందించడమే లక్ష్యం**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 13 నేటి శుభోదయ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో 1000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి పాల్గొని మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు, మన సంప్రదాయాలు ఆధ్యాత్మిక విలువలను కాపాడేందుకు అశోక్ రెడ్డి చేస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా ప్రజలకు సేవ చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తనవంతు కృషి చేస్తున్నారని కొనియాడారు. అశోక్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందుకే హౌసింగ్ బోర్డు కాలనీ ప్రజలకు 1000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మట్టి వినాయకులను వినియోగించడం వల్ల పర్యావరణానికి హాని కలగకుండా పండుగను ఆనందంగా జరుపుకోవచ్చని, ప్రజలందరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడమే తన ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని అశోక్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, యువత, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా అందజేస్తున్న అశోక్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయ లక్ష్మణ్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్ నాయుడు, తిరుములరెడ్డి, శాంత కుమార్, మల్లోబులు, ప్రసాద్, రవికుమార్, ఈశ్వర్ ప్రసాద్, నాగరాజు, గురు శ్రీధర్, సునీల్, మరియు తదితరులు పాల్గొన్నారు

# వరుసగా రెండో నెల ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 13 నేటి శుభోదయ : బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో వరుసగా రెండో నెల ఉచిత కంటి వైద్య శిబిరాన్ని అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురు ప్రజలు పాల్గొని ఉచిత కంటి పరీక్షలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిరణ్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అశోక్ రెడ్డి గత 12 సంవత్సరాలుగా హౌసింగ్ బోర్డు కాలనీలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన అశోక్ రెడ్డికి సామాన్య ప్రజలు ఎదుర్కొనే కష్టాలు, సమస్యలు తెలుసునని, అందుకే తనవంతుగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ప్రజల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలు కేవలం పదవులు అనుభవించడానికి లేదా విలాసవంతమైన జీవితం గడపడానికి కాదని, ప్రజలకు సేవ చేయడమే నిజమైన రాజకీయాల లక్ష్యమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చూపిస్తున్న సేవా మార్గం, స్ఫూర్తితో ప్రజలకు సేవ చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. సక్ష్యం సంస్థ సహకారంతో ప్రతినెలా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ సభ అధ్యక్షులు తిరుమలరెడ్డి టీడీపీ నాయకులు కేశవ నాయుడు , మండల అధ్యక్షులు బోయ లక్ష్మణ్, సీనియర్ నాయకులు వాల్మీకి కుళ్లాయప్ప, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కేశవ్ నాయక్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు మల్లోబులు, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, అధికార ప్రతినిధి చంద్రశేఖర్, గురు శ్రీధర్, సాయి వివేక్, భాస్కర్ రెడ్డి, అన్వేష్, కాటమయ్య, ఆశావాది రవికుమార్, స్థానికులు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ‘స్థానిక ఎన్నికలకు టీడీపీ శ్రేణులు పరస్పర సమన్వయం, ఐక్యతతో ముందుకు సాగాలి..!!’

**– సీతానగరం మండల నాయకులు, కార్యకర్తలకు టిడిపి రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి దిశానిర్దేశం..!**




కోరుకొండ, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ‘రూడా చైర్మన్’ తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పిలుపునిచ్చారు. రాజానగరం నియోజకవర్గం పరిధిలోని బూరుగుపూడి గేట్ వద్ద గల టీడీపీ పార్టీ కార్యాలయంలో ఈరోజు సీతానగరం మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణుల సన్నద్ధత, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాల విస్తరణ, నాయకులు--కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై చర్చించి దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో టీడీపీ బలాన్ని మరింత పెంచేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని బొడ్డు సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త తన వంతు బాధ్యతతో పనిచేయాలని, నాయకులందరూ పరస్పర సమన్వయంతో, ఐక్యతతో ముందుకు సాగాలని బొడ్డు వెంకటరమణ చౌదరి గారు సూచించారు. ఈ సమావేశంలో సీతానగరం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



# శాస్త్రోక్తంగా దసరా మహోత్సవాల క్యూలైన్ల పనులకు శ్రీకారం.

**ఆనవాయితీ ప్రకారం వినాయకుడి గుడి, ఘాట్ రోడ్డు వద్ద ప్రత్యేక పూజలు**



విజయవాడ, సెప్టెంబర్ 13 (నేటి శుభోదయ):-విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న ‘శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు--2026’ ఏర్పాట్లలో భాగంగా భక్తుల క్యూలైన్ల నిర్మాణ పనులను ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ప్రతి సంవత్సరం దసరా మహోత్సవాల సందర్భంగా క్యూలైన్లు ప్రారంభమయ్యే వన్ టౌన్ వినాయక గుడి వద్ద విఘ్నేశ్వర పూజ నిర్వహించి పనులు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఆలయ వైదిక కమిటీ నిర్ణయించిన శుభ ముహూర్తాన ఉదయం 7:30 గంటలకు పనులకు అంకురార్పణ చేశారు. కెనాల్ రోడ్ వినాయక గుడి ప్రాంగణం వద్ద, ఘాట్ రోడ్డు ప్రారంభ ప్రాంతంలో ఆలయ స్థానాచార్యులు శ్రీ విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పండితులు గణపతి పూజ తదితర వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ పాల్గొని పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి క్యూలైన్ల నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించి, ఉత్సవాలు నిర్విఘ్నంగా, విజయవంతంగా సాగాలని గణనాథుని ప్రార్థించారు. ?ఈ సందర్భంగా ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ దసరా నవరాత్రులకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, బారికేడ్లు, చలువ పందిళ్లు, తాగునీరు ఏర్పాటు తదితర పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల నుండి వచ్చిన ఆదేశాలు పాటించి సకాలంలో పనులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించిన్నట్లు పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీమతి ఎల్. రమాదేవి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ కుమార్, రవీంద్ర, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మస్తాన్ తదితర ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నగరంలోని అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో ముమ్మరంగా డీసెల్టింగ్ పనులు

**జేసీబీల సహాయంతో పేరుకుపోయిన సిల్ట్, వ్యర్థాల తొలగింపు**



విజయవాడ, సెప్టెంబర్ 13 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం నగరంలోని అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో డీసెల్టింగ్ పనులను అధికారులు ముమ్మరంగా చేపట్టారు. జేసీబీల సహాయంతో డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్ట్, వ్యర్థాలను శరవేగంగా తొలగించే ప్రక్రియను కొనసాగించారు. ఈ సందర్భంగా సీవీఆర్ ఫ్లైఓవర్ సమీపంలోని అవుట్‌ఫాల్ డ్రెయిన్, రామవరప్పాడు వద్ద గల అవుట్‌ఫాల్ డ్రెయిన్, లయోలా కాలేజ్ సమీపంలోని అవుట్‌ఫాల్ డ్రెయిన్ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, కొనసాగుతున్న డీసిల్టింగ్ పనులను పర్యవేక్షించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్ట్, వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నగరంలో వర్షాల నేపథ్యంలో డీసిల్టింగ్ పనులను నిరంతరాయంగా కొనసాగిస్తూ, అవసరమైన ప్రాంతాల్లో యంత్రాలు, సిబ్బందిని వినియోగించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

# వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి డీసిల్టింగ్ పనులు నిరంతరాయంగా కొనసాగించాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 13 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఉదయం శాఖాధిపతులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, నగరంలో వర్షాల పరిస్థితి, పారిశుధ్య చర్యలు, డీసిల్టింగ్ పనులు, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మాన్సూన్ రెస్పాన్స్ టీమ్స్ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిలిచిపోకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మూడు సర్కిళ్ల పరిధిలోని అవుట్‌ఫాల్ డ్రెయిన్లు, ప్రధాన డ్రెయిన్ల వద్ద జేసీబీలను వినియోగించి సిల్ట్ తొలగింపు పనులు నిరంతరం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కొనసాగుతున్న డీసెల్టింగ్ పనులను వేగవంతం చేసి, అవసరమైన ప్రాంతాల్లో అదనపు యంత్రాలు, సిబ్బందిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా డ్రెయిన్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. అదేవిధంగా, భారీ వర్షాలు కురిసే పరిస్థితుల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. అవసరమైన సందర్భాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా రిహాబిలిటేషన్ సెంటర్లను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఆయా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, భోజనం తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులు తమ పరిధిలోని పునరావస కేంద్రాలను పరిశీలించి, అవసరమైన అన్ని వసతులు సమకూర్చాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించే విధంగా సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

# మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణహితంగా వినాయక చవితిని జరుపుకుందాం పూజా, పూల వ్యర్థాలను కాలువల్లో వేయకుండా నగరపాలక సంస్థకు అందజేయాలి

**: వియంసి కమిషనర్ ధ్యానచంద్ర**

విజయవాడ, సెప్టెంబర్ 13 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఉదయం నగర ప్రజలకు వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితిని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. మట్టి వినాయక ప్రతిమల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని తెలిపారు. వినాయక ప్రతిమల నిమజ్జనం సమయంలో పూలు, పూజా సామగ్రి, ఇతర పూజా వ్యర్థాలను కాలువల్లో లేదా బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా నగరపాలక సంస్థ సిబ్బందికి అందజేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. సేకరించిన పూల వ్యర్థాలను వినియోగించి అగరబత్తులు, ధూప్ స్టిక్స్ వంటి పర్యావరణహిత ఉత్పత్తులను తయారు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలందరూ పరిశుభ్రతను పాటిస్తూ, పర్యావరణానికి హాని కలగకుండా వినాయక చవితిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర కోరారు.

# కళాశాల 6.67 ఎకరాల స్థలాన్ని కాపాడటం మా బాధ్యత ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాక్రాంతం కానివ్వం

**--ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ, సెప్టెంబర్ 13 (నేటి శుభోదయ):- బిఆర్ టిఎస్ రోడ్డులోని సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విద్యా సంస్థలకు సంబంధించిన విలువైన భూములను పరిరక్షించడం ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యత అని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ా== ఁ జఎ= ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కాలువకు అవతల ఉన్న 6.67 ఎకరాల విలువైన స్థలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాక్రాంతం కానివ్వబోమని స్పష్టం చేశారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తనను కలిసి, కళాశాలకు చెందిన 6.67 ఎకరాల స్థలాన్ని పరిరక్షించాలని వినతిపత్రం అందించారని తెలిపారు. ఈ భూమి విద్యాసంస్థకు చెందిన విలువైన ఆస్తి అని, భవిష్యత్‌లో కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల అవసరాలకు ఉపయోగపడే ఈ స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. ఈ అంశాన్ని తాను అత్యంత ప్రాధాన్యతతో తీసుకున్నానని, స్థలం అన్యాక్రాంతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు, రెవెన్యూ శాఖ అధికారులకు లేఖలు రాసినట్లు వెల్లడించారు. గతంలో కూడా ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకున్నామని, ప్రస్తుతం కూడా ఎలాంటి అక్రమ ఆక్రమణలకు అవకాశం ఇవ్వబోమని ఉమా స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులను, ముఖ్యంగా విద్యాసంస్థలకు చెందిన భూములను కాపాడటం ప్రభుత్వ బాధ్యతతో పాటు ప్రజాప్రతినిధిగా తన బాధ్యత కూడా అని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉపయోగపడాల్సిన భూములను వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎవరైనా ఆక్రమించాలని చూస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ా== ఁ జఎ= కళాశాల అభివృద్ధికి అవసరమైన ఈ 6.67 ఎకరాల స్థలాన్ని పూర్తిస్థాయిలో పరిరక్షించి, భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ఉమా తెలిపారు. విద్యను అందించే కళాశాలలను కాపాడటం ఎంత ముఖ్యమో.. ఆ కళాశాలలకు చెందిన ఆస్తులను కాపాడటం కూడా అంతే ముఖ్యమని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

# కనుపూరు గ్రామంలో జనసేన, కూటమి పార్టీల అభ్యర్థి ‘ముక్కా రాంబాబు’కే విజయావకాశాలు..!!

**– గ్రామంలో ఏ నోట విన్నా..’ రాంబాబు ‘ మాటే..!!**

**– విద్యావంతుడు, యువకునికే ఈసారి పట్టం కడతామంటున్న గ్రామస్తులు, యువకులు..!!**



కోరుకొండ, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); ప్రతిష్టాత్మకంగా జరగనున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి విషయంలో రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం కనుపూరు గ్రామంలో ప్రజలు నాడి,వారి ఆలోచనలు ఈసారి చాలా ఉన్నతంగా, పరిణితి చెందినవిగా ఉన్నాయి. కనుపూరు గ్రామం ఇప్పటివరకు అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉండడానికి ప్రధాన కారణం కనుపూరు గ్రామంలో ఇప్పటివరకు గెలిచిన అభ్యర్థులు విద్యావంతులు లేకపోవడం, నిధులు సమకూర్చుకోవడంలో సరైన అవగాహన లేకపోవడంతో గ్రామం అభివృద్ధి జరగలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఈసారైనా చదువుకున్న వ్యక్తిని సర్పంచ్ గా గెలిపించుకుని గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని దృఢ సంకల్పంతో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో సర్పంచ్ అభ్యర్థి గా ముందంజలో ఉన్న జనసేన, కూటమి తరపున విద్యావంతుడు, యువకుడు ముక్కా రాంబాబు గట్టి పోటీ ఇస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు చర్చించుకుంటున్నారు. గ్రామంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన రాంబాబు పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారి నుండి అన్ని పార్టీల వారి నుండి మంచి మద్దత్తును సంపాదించుకున్నారు. అజాత శత్రువుగా అందరిని కలుపుకుంటూ పార్టీలకు అతీతంగా ఎవరికి ఎలాంటి సహాయం కావాలన్న వెంటనే స్పందించి గ్రామ ప్రజలకు వీలైనంత సేవ చేస్తూ.. అందరి మన్నలను పొందారని స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రాజానగరం నియోజకవర్గం లో కీలక పాత్ర పోషించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, శ్రీమతి వెంకటలక్ష్మిలకు నమ్మిన బంటులా వుండి వారి ఆశీస్సులు పుష్కలంగా పొందారు. ముక్కా రాంబాబు కి సర్పంచ్ అభ్యర్థి గా కూటమి ప్రభుత్వం తరపున అవకాశం ఇస్తే అతని గెలుపు నల్లేరు మీద నడకే అని గ్రామస్థులు చెబుతున్నారు. కాగా గ్రామం మౌలిక సదుపాయాల విషయంలో, గ్రామ అభివృద్ధి కోసం,దేవుని కొండ (శివాలయం)అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకున్నానని, అలాగే రైతుల కష్టాలు తీర్చడానికి, పంట పొలాలను సస్య శ్యామలం చేయడానికి పోలవరం లేదా పుష్కర కాలువ నుండి లిఫ్ట్ ఇరిగేషన్ సాధించి తీరుతానని రైతుల కళ్లలో ఆనందాలు కలుగజేస్తానని రాంబాబు వినయ పూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

# రిటైనింగ్ వాల్ బాధితులకు కబేలా సెంటర్ ప్రభుత్వ గృహాలు కేటాయించాలి!

**ఇల్లు కోల్పోయిన కుటుంబాలకు తక్షణమే పునరావాసం కల్పించాలి: వెలంపల్లి**



విజయవాడ, సెప్టెంబర్ 13 (నేటి శుభోదయ):-49వ డివిజన్ జగుపిళ్ళ రామారావు వీధిలో రిటైనింగ్ వాల్ కూలిపోవడంతో ఇల్లు ధ్వంసమైన బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకుని అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఘటనాస్థలం నుంచే నగరపాలక సంస్థ కమిషనర్, ఎమ్మార్వోలకు ఫోన్ చేసిన వెలంపల్లి ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని కోరారు. ముఖ్యంగా కబేలా సెంటర్‌లో ప్రభుత్వం నిర్మించిన ప్రభుత్వ గృహాలను రిటైనింగ్ వాల్ ఘటనలో ఇల్లు కోల్పోయిన బాధితులకు కేటాయించి, వారికి సురక్షితమైన నివాసం కల్పించాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్న బాధితులు, సొంత ఇళ్లను కోల్పోయిన బాధితులు అనే తేడా లేకుండా వారి పరిస్థితులను అధికారులు పరిగణనలోకి తీసుకుని తగిన న్యాయం చేయాలని వెలంపల్లి కోరారు. బాధిత కుటుంబాలు ఇబ్బందుల్లో ఉన్న సమయంలో అధికారులు స్పందించి, పునరావాసం, అవసరమైన సహాయం అందించేలా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పోరాడుతామని వెలంపల్లి శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



# యాడికి వాసికి అరుదైన గౌరవం
## అడ్వకేట్‌గా పట్టా పొందిన జూటూరు ఫిరోజ్



యాడికి సెప్టెంబర్ 13 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త, డాక్యుమెంట్ రైటర్ జూటూరు అబ్దుల్ రజాక్ దంపతుల ద్వితీయ కుమారుడు జూటూరు ఫిరోజ్ న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఇటీవల నిర్వహించిన ప్రతిష్ఠాత్మక ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ ఎగ్జామినేషన్‌లో ఘన విజయం సాధించిన ఆయన, అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రాంగణంలో అధికారికంగా అడ్వకేట్‌గా ఎన్‌రోల్‌మెంట్ చేసుకుని పట్టా అందుకున్నారు.ఒకే కుటుంబం నుంచి ఇద్దరు కుమారులు ఉన్నత వృత్తుల్లో స్థిరపడటంతో జూటూరు కుటుంబంలో పండగ వాతావరణం నెలకొంది. గత ఏడాది పెద్ద కుమారుడు జూటూరు అర్షద్ వైద్య విద్యను పూర్తి చేసి డాక్టర్‌గా సేవలు అందిస్తుండగా, ఇప్పుడు చిన్న కుమారుడు ఫిరోజ్ న్యాయవాదిగా పట్టా పొందడం పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆనందాన్ని, గర్వాన్ని వ్యక్తం చేస్తున్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఫిరోజ్ ఈ స్థాయికి చేరుకోవడం మండల ప్రజలకు, యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని స్థానికులు కొనియాడారు.ఈ సందర్భంగా జూటూరు ఫిరోజ్‌కు బంధుమిత్రులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు మరియు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. న్యాయవాద వృత్తిలోని విలువలను కాపాడుతూ, నిరుపేదలకు అండగా నిలుస్తూ సమాజానికి తనవంతు సేవలు అందించాలని, భవిష్యత్తులో ఈ వృత్తిలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు..

# ఘనంగా మాజీ కార్పొరేటర్ రాపర్తి శరత్ జన్మదిన వేడుకలు

**– వివిధ రాజకీయ పార్టీల నాయకులు,**

**మున్నూరు కాపు ప్రముఖులు, పాత్రికేయులు, అభిమానుల మధ్య భారీ కేక్ కటింగ్**



ఖమ్మం, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: మాజీ తాజా కార్పొరేటర్ రాపర్తి శరత్ జన్మదిన వేడుకలు ఆదివారం ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్నూరు కాపు పటేల్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, మున్నూరు కాపు సంఘం నాయకులు, వార్డు సభ్యులు, పాత్రికేయులు, స్నేహితులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై భారీ కేక్‌ను కట్ చేసి రాపర్తి శరత్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా జీవితంలో రాపర్తి శరత్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలతో సన్నిహితంగా ఉంటూ అందరినీ కలుపుకొని ముందుకు సాగే ఆయనకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలు లభించాలని ఆకాంక్షించారు.జన్మదిన వేడుకలు రాజకీయ, సామాజిక వర్గాలకు చెందిన ప్రముఖుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. శరత్‌ను అభిమానించే నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. కార్యక్రమంలో డీసీసీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, మున్నూరు కాపు పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, చందు జనార్దన్, శీలంశెట్టి వీరభద్రం, పసుపులేటి దేవేందరరావు, మదూరు పూర్ణచందర్‌రావు, మెంతుల శ్రీశైలం, బచ్చు మధు, తాళ్లూరి హనుమంతరావు, పసుపులేటి నాసరయ్య, తోట రామారావు, జంగిలి రమణ, రంగా జనార్దన్, ఉండేలా గంగాధర్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, పసుమర్తి రామ్మోహన్, ప్రసన్న, గంగిశెట్టి శ్రీనివాస్, బొమ్మిశెట్టి రమేష్, యర్రా అప్పారావు, మాటేటి రవి, సీహెచ్ విప్లవ్‌కుమార్, బైరిశెట్టి శ్రీనివాస్, సూరపనేని బాబురావు, పసుపులేటి నాగరాజు, ఉపేందర్, నాగసాయి శేఖర్, పాల్వంచ రామారావు, తీగల విజయ్, ముత్యం ఉప్పలరావు, పసుపులేటి నాగేశ్వరరావు, హుస్సేన్, యాకూబ్, వెంకట్ నాయుడు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణం ఉన్నంతవరకు ప్రజాసేవలోనే గడుపుతాం

– దివ్యాంగులకు కృత్రిమ పాదాలు పంపిణీ లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్




ఖమ్మం, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: ప్రాణం ఉన్నంతవరకు ప్రజాసేవలోనే గడుపుతాం అని తెలంగాణ రాష్ట్ర మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఖమ్మం రోటరీ క్లబ్, పువ్వాడ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలు పంపిణీ చేసే సేవా కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు.తన తండ్రి ఖమ్మం మాజీ శాసనసభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు 88వ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, అయితే వినాయక చవితి రాకతో ఈ సారి ఒక రోజు ముందుగానే ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. గత 14 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు 1,140 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలను అమర్చినట్లు వెల్లడించారు.ఈ సేవా కార్యక్రమానికి పువ్వాడ ఫౌండేషన్ రూ. 3,52,000 ఆర్థిక సాయాన్ని రోటరీ ట్రస్ట్ ద్వారా అందజేసింది. తన తండ్రి 88 నిండు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, మానవతా దృక్పథంతో బాధితులకు చేయూతనందించాలనే ఉద్దేశంతో ఈ నిధులను సమకూర్చినట్లు ఈ రోజు ఒక్క రోజే 88 మందికి కృత్రిమ పాదాలు అందించినట్లు చెప్పారు. గత 30 ఏళ్లుగా ఖమ్మంలోని రోటరీ లింబ్ సెంటర్ ద్వారా వేలాది మందికి సేవలు అందించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఈ సెంటర్ ఎంతో కృషి చేస్తోందన్నారు. పేదలకు ఉచిత, మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే 1996లో 'మమతా హాస్పిటల్' (జనతా హాస్పిటల్) ను ప్రారంభించామని, నాటి నుండి నేటి వరకు లక్షలాది మంది పేదలకు ఉచిత వైద్యం అందించామని గుర్తుచేశారు. కమ్యూనిస్టు నాయకుడిగా, ప్రజా పక్షాన నిలబడిన పువ్వాడ నాగేశ్వరరావు తమ కుటుంబానికి ఎంతో స్ఫూర్తి అని, ఆయన ఆశయాలకు అనుగుణంగానే తమ కుటుంబం విద్యా, వైద్య, సామాజిక రంగాల్లో సేవలందిస్తోందని స్పష్టం చేశారు. దివ్యాంగుల కదలికలకు, వారి ఆత్మవిశ్వాసానికి తోడ్పడుతున్న రోటరీ క్లబ్ సభ్యులకు, వైద్య బృందానికి, నిర్వాహకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రోటరీ ట్రస్ట్ చైర్మన్ మల్లాది వాసుదేవ్,రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ప్రెసిడెంట్ హరి శ్రీనివాస్,వైస్ చైర్మన్ కాళ్ళ పాపారావు,సెక్రటరీ దొడ్డపనేని సాంబశివరావు,వంగల జగన్నాథం,పసుమర్తి రంగారావు, ఎన్ వి ఎన్ ఎస్ ఎన్ ప్రసాద్,చిటోజు రామకృష్ణ, వల్లభనేని రామారావు నాయకులు ఆర్ జే సి కృష్ణ, పగడాల నాగరాజు,బత్తుల మురళీ తదితరులు పాల్గొన్నారు.




# ఫార్మా సాంకేతిక విప్లవాన్ని చాటిచెప్పిన అనలిటికా ల్యాబ్ ఇండియా ఎక్స్‌పో

**మాచర్లలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం..**

**యువతకు ఉపాధే లక్ష్యం: యాగంటి మల్లికార్జునరావు**




మాచర్ల: ఆర్ సి ఇన్చార్జి సెప్టెంబర్ 13; నేటి శుభోదయ : ఫార్మాస్యూటికల్ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన ప్రయోగశాల పరికరాలను ప్రతిబింబించేలా హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహిస్తున్న అనలిటికా ల్యాబ్ ఇండియా ఎక్స్‌పో ఆకట్టుకుంటోందని మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం ఆయన ఎక్స్‌పోను సందర్శించి వివిధ సంస్థల స్టాళ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఫార్మాస్యూటికల్ రంగంలో వినియోగిస్తున్న అత్యాధునిక ల్యాబొరేటరీ పరికరాలు, వాటి పనితీరు, పరిశోధనల్లో సాంకేతికత వినియోగం, నాణ్యతా ప్రమాణాలపై సంస్థల ప్రతినిధులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. యూఎస్ఎస్ ఫార్మా అనలిటిక్స్ ప్రతినిధి వంగేపరపు క్రాంతికుమార్, భాగ్యలక్ష్మి ఎలక్ట్రోలాబ్ ప్రతినిధి మధు, ల్యాబ్ ఇండియా ప్రతినిధి కిషోర్, గ్లాస్కో ప్రతినిధి రామ్ నరేష్ తదితరుల స్టాళ్లను ప్రత్యేకంగా సందర్శించారు.

### పరిశ్రమలకు ప్రాధాన్యం

యాగంటి మల్లికార్జునరావు మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ పరిశ్రమల అభివృద్ధికి ఆధునిక ల్యాబ్ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో కీలకమన్నారు. పరిశోధనల్లో కచ్చితత్వం, నాణ్యతతో కూడిన ఫలితాల సాధనకు అత్యాధునిక సాంకేతికత దోహదపడుతుందని తెలిపారు. అనలిటికా ల్యాబ్ ఇండియా ఎక్స్‌పోలో ఫార్మా రంగంలో వస్తున్న మార్పులు, నూతన ఆవిష్కరణలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు ఇదే సరైన సమయమని అన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పరిశ్రమలను తీసుకురావడంతో పాటు యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. టెక్స్టైల్ పరిశ్రమ ఏర్పాటుకు దాదాపు 500 ఎకరాల భూమిని కేటాయించే దిశగా చర్యలు చేపట్టడం నియోజకవర్గ అభివృద్ధిలో కీలక ముందడుగని పేర్కొన్నారు.

### యువతకు స్థానికంగానే ఉపాధి

టెక్స్టైల్ పరిశ్రమతో పాటు ఫార్మా, అనుబంధ పరిశ్రమలు, ల్యాబొరేటరీలు, ఇతర పారిశ్రామిక సంస్థలు మాచర్ల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని యాగంటి కోరారు. పరిశ్రమలు ఏర్పాటైతే స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని అన్నారు."పరిశ్రమలు వస్తే పెట్టుబడులు వస్తాయి.. పెట్టుబడులు వస్తే ఉద్యోగాలు వస్తాయి.. ఉద్యోగాలు వస్తే మాచర్ల యువత భవిష్యత్తు మారుతుంది. మాచర్లను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు స్థానికంగానే ఉపాధి కల్పించడమే మా లక్ష్యం" అని యాగంటి మల్లికార్జునరావు పేర్కొన్నారు.పరిశ్రమల అభివృద్ధి, ఆధునిక సాంకేతికత, యువతకు ఉద్యోగ అవకాశాలను సమన్వయం చేస్తే మాచర్లను పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే మరిన్ని పరిశ్రమలు మాచర్ల ప్రాంతానికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.కార్యక్రమంలో హెటిరో జీఎం కెమికల్ హరినాథరెడ్డి, వంగేపరపు కోటేశ్వరరావు, మస్తాన్, శివ, చేకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.




# పట్టణ దాహార్తికి యుద్ధప్రాతిపదికన చర్యలు..!

**విపత్తు ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ నీటి వనరులపై దృష్టి**

**శరవేగంగా కాలువ పనులు..క్వారీకి తాగునీరు తరలించే ఏర్పాట్లు**

**మూడు రోజుల్లో 80 శాతం పనులు పూర్తి**





మాచర్ల, సెప్టెంబర్ 13: ఆర్ సి ఇన్చార్జి;నేటి శుభోదయ : మాచర్ల పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావడంపై అధికారులు దృష్టి సారించారు.మాచర్ల మున్సిపల్ పంపుహౌస్ వద్ద 54 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న క్వారీ పట్టణానికి ప్రధాన తాగునీటి నిల్వగా ఉంది. వినాయకుడిగుట్ట వద్దనున్న పంపుహౌస్ నుంచి సుమారు 1.5 కిలోమీటర్ల దూరం వరకు ఆర్సీసీ పైపులైన్ ద్వారా సాగర్ కుడికాలువ కృష్ణా జలాలను మోటార్ల సహాయంతో క్వారీకి తరలిస్తున్నారు. సుమారు 25 అడుగుల లోతు, 1,300 మిలియన్ లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన క్వారీని పూర్తిస్థాయిలో నింపేందుకు దాదాపు రెండు నెలల సమయం పడుతోంది.అయితే ఎన్ఎస్పీ అధికారులు తాగునీటి అవసరాల కోసం కుడికాలువ నుంచి కేవలం 15 రోజులపాటు మాత్రమే నీటిని సరఫరా చేసేలా గడువు విధించడంతో సమస్య తీవ్రతరమవుతోంది. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గిన సమయంలో పట్టణంలో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

### గ్రావిటీ ద్వారా నీటి తరలింపు

ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచనల మేరకు లింగాపురం ప్రభుత్వ లే-అవుట్ సమీపంలోని కుడికాలువ నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించే ప్రత్యామ్నాయ మార్గానికి శ్రీకారం చుట్టారు. భారీ జేసీబీలతో చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే మూడు రోజుల్లో దాదాపు 80 శాతం పనులు పూర్తయినట్లు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.కుడికాలువ వద్ద 20 నుంచి 30 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్ల ద్వారా నీటిని తోడి ముందుగా నిర్మిస్తున్న కాలువలోకి మళ్లించనున్నారు. అనంతరం గ్రావిటీ ఆధారంగా నీటిని ఆర్టీసీ గ్యారేజ్ సమీపంలోని దేవళమ్మ చెరువుకు తరలిస్తారు. అక్కడి నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా మున్సిపల్ క్వారీకి నీటిని చేర్చేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

### జనవరి వరకు ఇబ్బందులు ఉండవు!

ఈ ప్రత్యామ్నాయ నీటి సరఫరా మార్గం అందుబాటులోకి వస్తే పట్టణంలో తాగునీటి సమస్యకు గణనీయంగా పరిష్కారం లభించే అవకాశం ఉందని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు భావిస్తున్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే వచ్చే ఏడాది జనవరి వరకు పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా సరఫరా కొనసాగించే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా పనులను వేగవంతం చేస్తున్నట్లు వారు వెల్లడించారు.

# న్యాయవాదిగా నవీన్ కుమార్ చారి ప్రమాణ స్వీకారం




మాచర్ల, సెప్టెంబర్ 13: ఆర్ సి ఇన్చార్జి;నేటి శుభోదయ :మాచర్ల పట్టణానికి చెందిన మల్లవరపు నవీన్ కుమార్ చారి అడ్వకేట్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం అమరావతిలోని ది బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన న్యాయవాదిగా ప్రమాణం చేశారు.బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి బి. పద్మలత, చైర్మన్ చలసాని అజయ్ కుమార్ సమక్షంలో నవీన్ కుమార్ చారి ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. న్యాయవృత్తిలోకి నూతనంగా అడుగుపెడుతున్న ఆయన న్యాయపరమైన విలువలు, న్యాయసూత్రాలు, రాజ్యాంగ స్ఫూర్తికి కట్టుబడి ప్రజలకు న్యాయ సేవలు అందించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. న్యాయం, నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తూ సమాజానికి తన వంతు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ చారి కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఆయనకు అభినందనలు తెలిపారు.న్యాయవృత్తిలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని వారు ఆకాంక్షించారు. మల్లవరపు సుబ్బయ్య చారి కుమారుడైన నవీన్ కుమార్ చారి న్యాయవాదిగా విజయవంతమైన ప్రస్థానం కొనసాగించాలని పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంగా స్వచ్ఛభారత్

**మొక్కల చుట్టూ కలుపు తొలగింపు.. నీటి సరఫరా**

**ప్రతి ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహణ: మెట్టు గోవిందరెడ్డి**



మాచర్ల ఆర్ సి ఇన్చార్జి సెప్టెంబర్ 13; నేటి శుభోదయం : పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతే లక్ష్యంగా శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు మాచర్ల--గుంటూరు రోడ్డులోని కోర్టు సమీపం నుంచి మాచర్ల మార్కెట్ యార్డు వరకు రహదారికి ఇరువైపులా ఉన్న మొక్కల పరిసరాలను శుభ్రం చేశారు.మొక్కల చుట్టూ పెరిగిన కలుపు మొక్కలను తొలగించడంతో పాటు మున్సిపల్ వాటర్ ట్యాంక్ ద్వారా మొక్కలకు నీటిని అందించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకుంటున్నట్లు శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు.మానవసేవే మాధవసేవ అన్న స్వామి వివేకానంద స్ఫూర్తితో, పరిశుభ్రతలోనే పరమాత్ముడు ఉన్నాడు అన్న మహాత్మా గాంధీ ఆశయాలతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో ప్రతి ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.గ్రీన్ మాచర్ల.. స్వచ్ఛ మాచర్ల సంకల్పంతో పట్టణాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని గోవిందరెడ్డి కోరారు. వారానికొకసారి నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ మహనీయులు కలలుగన్న నవభారత నిర్మాణానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పి. హరిబాబు, ఉప్పుతోల్ల వెంకట్ నారాయణ, ఎం. పాపిరెడ్డి, ఎర్రబోతుల నాగశంకర్ రెడ్డి, ఆర్టీసీ రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతలకు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదు

-టిడిపి జిల్లా పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి



పెనమలూరు,సెప్టెంబర్ 13నేటి శుభోదయ: వైఎస్సార్‌సీపీ జిల్లా సమావేశంలో కొడాలి నాని, పేర్ని నాని, వల్లభనేని వంశీ ఏదేదో మాట్లాడుతున్నారని టిడిపి జిల్లా పార్టీ అధ్యక్షులు వీరంకి గురుమూర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ అన్నారు.ఆదివారం పోరంకి తెలుగుదేశం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకుని, ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టిన వైసీపీ నేతలకు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. వైసీపీ నేతలు శ్రీరంగ నీతులు చెబుతూ ఉన్నారు.శ్రీరంగ నీతులన్నమాట.పాపం వాళ్ళకి ఏమీ తెలియదంట. ఏమీ తెలియదంట, అమాయకులంట, జైల్లో పెట్టారంట.పెన్షన్ గురించి మాట్లాడుతూ ఉన్నాడు కొడాలి నాని. ఎన్. పెన్షన్‌ని ప్రవేశపెట్టింది తెలుగుదేశం పార్టీ. ఆ రోజు నందమూరి తారక రామారావు. దాన్ని రు.200 చేసింది చంద్రబాబు నాయుడు, రు.2000 చేసింది చంద్రబాబు నాయుడు. మీరు రు.2000 నుంచి రు.3000 చేయడానికి ఐదు సంవత్సరాలు పట్టింది..ఐదు సంవత్సరాలా! కానీ మీరు పోయిన తెల్లారి రు.3000ని రు.4000 చేయడానికి మాకు..ఐదు రోజుల్లోనే చేశాం మేము. చేసి, మూడు నెల పాత బకాయిలు కూడా చరిత్రలో ఎవరూ ఇవ్వని విధంగా మేమిచ్చాం.ఏదో నువ్వేదో పెన్షన్ ఏదో పెంచేసావని ఏదో ఏదో హరికథలు చెప్తే, జనాలేమన్నా మోసపోవడానికి ఏమన్నా పిచ్చోళ్ళా పైగా సర్టిఫికెట్లు ఇచ్చుకుంటున్నారు వీళ్లకి వీళ్లే. పేర్ని నాని అంట, ఒక 80 లక్షల రూపాయల బియ్యం అంట, ఆ... ఏదో పోయినయంట. పోవడమేంటి80 లక్షల రూపాయల బియ్యాన్ని కొట్టేసినటువంటి దొంగకి నువ్వు వత్తాసు పలుకుతున్నావ్.గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకుని, ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టిన వైసీపీ నేతలకు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు.అదేమంటే నీతిమంతులంట, రాజకీయాల నుండంట తప్పుకుంటానన్నాడంట. పార్టీ అంటే అప్పుడు అధికారం లేదు కాబట్టి నిలబడ్డాడంట. ఏ రోజైనా మీరు మాటల మీద ఎప్పుడైనా నిలబడ్డారా మీకు మాట మీద నిలబడే ఇది ఉందా నేను అడుగుతున్నా, పేర్ని నాని ఏదైతే రాజకీయ సన్యాసం చేస్తానన్నాడు, నాకు రాజకీయం వద్దు సన్యసిస్తుంటానంటే వ్యక్తి ఎందుకు వచ్చాడు రాజకీయాల్లోకి అదేవిధంగా కొడాలి నాని, చంద్రబాబు నాయుడు మళ్లీ గెలిస్తే ఆయన బూట్లు తుడుస్తా, ఆయన బూట్లు నాకుతా అన్నాడు. సిగ్గు, శరం ఉండాలిరా నీకు నీకు సిగ్గు, శరం ఉందా నీకు సిగ్గు, శరం ఉందా నువ్వేమన్నా అభివృద్ధి చేశావా ఏనాడన్నా గుడివాడను? ఏనాడన్నా గుడివాడ ప్రజల్ని నువ్వు ఎప్పుడైనా పట్టించుకున్నావా ఎప్పుడూ పట్టించుకున్నటువంటి పాపాన పోలేదు కదా! పైగా ఏదో ఓ కబుర్లు చెప్పేస్తున్నావు. ఐదు సంవత్సరాలలో మీరు ఉపాధి హామీ నిధులన్నీ మీరేగా దొంగతనం చేసింది కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చినటువంటి సిమెంటు పట్టా పేరుతో నువ్వు కూడా చేశావు కదా గుడివాడలో నువ్వు చేసిన మాట వాస్తవం కాదా సిమెంటు పట్టా పేరుతో మొత్తం కూడా దోపిడీ చేసేశారు. మీరు వేసింది 1000 కిలోమీటర్లు. ఆ రోజున రోడ్లు లేక మీ తాలూకా వైస్ ఎంపీపీనో, ఎంపీపీనో గన్నవరం దగ్గర చనిపోయాడు. ఎంతమందిని మీరు పొట్టన పెట్టుకున్నారు రోడ్లమీద గుంతలలో పడి అది పూడ్చడానికి రు.2000 కోట్లు మాకు కావాల్సి వచ్చింది. 14-19 మధ్యన మేము 25,000 కిలోమీటర్లు సిమెంట్ రోడ్లు వేశాం. ఈ రోజు ఇప్పటికి 8,000 కిలోమీటర్లు వేశాం. నేను అడుగుతున్నా, నేను చెబుతా ఉన్నా... స్థానిక సంస్థల్లో మీకు పోటీ చేసే అర్హతే లేదు! నేనెందుకు చెప్తున్నానంటే ఈ మాట మీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఆ రోజున వచ్చినటువంటి ఉపాధి నిధులన్నిటినీ కూడా మీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు దోపిడీ దొంగల్లాగా దోచుకున్నారు. స్థానిక సంస్థల నిధులు ఏదైతే ఉందో, రు.8,664 కోట్ల నిధులు దారి మళ్లించారు మీరు. ఆ రోజు మీ సర్పంచులు, మీ ఎంపీపీలు, మీ జెడ్పీటీసీలు గగ్గోలు పెట్టారు. అయినా మీరేం పెడచెవిన పెట్టారే! ఈ రోజు మేము 8,000 కిలోమీటర్లు వేశాం ఈ రెండు సంవత్సరాల్లోనే. రు.11,700 కోట్లు ఇచ్చాం. 15వ ఫైనాన్స్ కానివ్వండి, పల్లె పండుగ 1 కానివ్వండి, పల్లె పండుగ 2 కానివ్వండి. ఇవాళ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ , ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఇవాళ బ్రహ్మాండంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇవాళ రోడ్ల వ్యవస్థని మేము తీసుకెళ్తా ఉన్నాం.అంతేకాకుండా మీరు ఇంకో మాట కూడా మాట్లాడుతూ ఉన్నారు. స్థానిక సంస్థల్లో అంట మేము కేసులు పెడతాం, ఏమన్నా బొక్కలో వేస్తామంట. ఎవరు పల్నాడులో నామినేషన్ పత్రాలు, నామినేషన్లు వేయకుండా అడ్డుపడుతున్నారని మా బోండా ఉమా, బుద్దా వెంకన్న , పారా కిషోర్ నే అడ్వకేట్ వెళ్తే... కిషోర్ అనే అడ్వకేట్ వెళ్తే, మరి ఆ రోజున అక్కడున్నటువంటి వాళ్ళు ఎంత దౌర్జన్యంగా నడిరోడ్డు మీద ఎవరైతే ఒక కిషోర్ అనేటువంటి ఒక వ్యక్తి దారుణంగా దాడి చేస్తే, అతన్ని చైర్మన్ చేశారు మీరు. తోట చంద్రయ్య అనే అతన్ని కోడిని కోసినట్టు కోస్తే, అతడ్ని ఎంపీపీ చేశారని, మీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని దారుణాతి దారుణంగా చంపి డోర్ డెలివరీ చేస్తే... అదే ఎమ్మెల్సీని ఊరేగించి తీసుకొచ్చి పక్కన కూర్చోబెట్టుకుని వికవికలు, పకపకలు నవ్వినటువంటి వ్యక్తి జగన్మోహన్ రెడ్డి.మీరు... నీతుల గురించి మాట్లాడితే... మీరు అదేమంటే జైల్లో పెట్టామంటే ఎవరు పెట్టారు జైల్లో? ఎంత... ఎన్ని వేల మందిని పెట్టారు అమాయకుల్ని మీరు మా బీసీ నాయకులైనటువంటి అచ్చెన్నాయుడు ఏం పాపం చేశారు కేసు నిలబడిందా లేదే! కొల్లు రవీంద్ర ఏం పాపం చేశారు ఆయన్ని జైల్లో పెట్టారు కదా! దూళిపాళ్ల నరేంద్ర, దే... నేను ఉమా.. ఆఖరికి మాలాంటోళ్ళు కూడా కొన్ని వేల మంది వెళ్ళాం మా ఏ పాపం తెలియనటువంటి వాళ్ళు.గన్నవరం ఏదైతే తెలుగుదేశం పార్టీ దాడి కేసు ఉందో, ఆ రోజు వల్లభనేని వంశీ దగ్గరుండి దాడి చేసి పార్టీ కార్యాలయాన్ని సర్వనాశనం చేసిన మాట వాస్తవం కాదా ఎస్... కన్నతల్లి లాంటి పార్టీలో ఉండి మీరు, ఆ కన్నతల్లికి వెన్నుపోటు పొడిసేటటువంటి దుర్మార్గులు.ఇవాళ మీరు మాట్లాడుతా ఉన్నారా మీకు 'బి-ఫారం'లు ఇచ్చి మిమ్మల్ని ఎమ్మెల్యే చేస్తే... మీరు వెన్నుపోటు గురించి మాట్లాడుతారా వెన్నుపోటు అంటే... జగన్మోహన్ రెడ్డిది, లేకపోతే నీది! ఎందుకంటే... కన్న తండ్రి చనిపోతే ఎవరైనా బాధపడతారన్నారు. 'ఏంట్రా ఏం చేయాలి ఏం చేయాలి' అని ఆలోచిస్తారు. కానీ ఆయన ఎక్కడ పోతే మాకెందుకులే అని చెప్పి, ముఖ్యమంత్రి కోసం సంతకాలు పెట్టినటువంటి ప్రపంచంలో ఎవరైనా ఉంటారా తల్లిని వెన్నుపోటు పొడిచిన దుర్మార్గుడు ఎవడు చెల్లిని వెన్నుపోటు పొడిచిన దుర్మార్గుడు ఎవడు? బాబాయిని చంపింది ఎవరో మాట్లాడండి మీరు!అసలు చంద్రబాబు నాయుడు రాజకీయాలు ఇంకెందుకు ఉంటాడు. పార్టీనే చేసే చంద్రబాబు నాయుడు నే 53 రోజుల పాటు జైల్లో పంపినటువంటి దుర్మార్గులు మీరు! 21 లక్షల మందికి స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణనిచ్చి, లక్ష మందికి ఉద్యోగ కల్పన చేస్తే, అదే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆ రోజున అవార్డు ఇస్తే ఈ కార్యక్రమాన్ని మెచ్చి స్కిల్ డెవలప్‌మెంట్‌ని, చంద్రబాబు నాయుడు మీద అక్రమ కేసు పెట్టి జైల్లో పంపించిన మాట వాస్తవం కాదా పోనీ ఆ కేసు నిలబడిందా ఈరోజు కొట్టేసిన మాట వాస్తవం కాదా మీకన్నా దుర్మార్గులు ఎవరున్నారు మీకన్నా సన్నాసులు ఎవరున్నారు మీకన్నా అవినీతిపరులు ఎవరున్నారు ఇవాళ మీరు రంగులేసి ఆ రంగులు తీయడానికి ఎంత ఖర్చయిందో మీరు ఒకసారి ఆలోచించాలన్నారు. అదే విధంగా ఒక రైతు కష్టపడి సంపాదించుకున్నటువంటి పొలం ఏదైతే పాస్ బుక్ ఉందో, ఎవరైనా వాళ్ల బాబు ఫోటో కావాలనుకుంటాడు, తాత ఫోటో కావాలనుకుంటాడని, లేదంటే రాజముద్రతో ఇవ్వాలి. జగన్మోహన్ రెడ్డి ఫోటో ఇవ్వాల్సిన అవసరం ఏముందన్నారు. అందుకనే కదా మిమ్మల్ని 175కి 175 అంటే 11 లో కూర్చోబెట్టారని అనుకుంటున్నారు. ఖచ్చితంగా ప్రాణాలు పణంగా పెట్టయినా సరే ఈ రాష్ట్రాన్ని కాపాడుకుంటామన్నారు. ఎందుకంటే ఈ రాష్ట్రం ఇవాళ బ్రహ్మాండంగా స్కిల్ డెవలప్‌మెంట్ కానివ్వండి, ఉద్యోగ కల్పన ఇవాళ 20 లక్షల ఉద్యోగాలు చేయాలనే ఉద్దేశంతో నేడు గన్నవరం ప్రాంతంలో చూడండి, ఇదే మీ టైంలో అశోక్ లేలాండ్ పారిపోయింది, ఇవాళ తీసుకొచ్చి పని చేపిస్తున్నామన్నారు. మరోవైపు బెల్ కంపెనీ మచిలీపట్నంలో, అదేవిధంగా ఈ రాష్ట్రంలో గూగుల్ కావచ్చు, మిట్టల్ కంపెనీ కావచ్చు అనేక పరిశ్రమలు ఈ రోజున ఈ రాష్ట్రానికి తీసుకొచ్చి మరి ఉద్యోగం బిడ్డలకి ఉద్యోగం కోసం ఇవాళ మేము పనిచేస్తా ఉన్నాం. మీరు ఈ రాష్ట్రాన్ని లేదు, మీరు చెప్పండి, ఐదు సంవత్సరాలు ఉన్నారు, పోనీ ఈ ఇరిగేషన్‌లో రాయలసీమకు ఎంత ఖర్చు పెట్టారో చెప్పే దమ్ముంటే చెప్పండి మీరు నలుగురే బాగుపడితే ఎట్లా? మీ కార్యకర్తలను కూడా బాగుపడి అట్టా పదిమందిని చూపిస్తే అప్పుడు సంతోషపడతామని, అంతేగాని మీరు దోపిడీ చేసినటువంటి మీరు, మరి ఇవాళ నీతులు, సన్నాయి నొక్కులు నొక్కితే వినే పరిస్థితి ఎవళ్ళూ లేరని తెలియజేస్తామన్నారు.

## వెల్దుర్తి బీసీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**5 నుంచి 8వ తరగతి వరకు బాలికలకు ప్రవేశాలు..**

**ఈ నెల 15 నుంచి 17 వరకు దరఖాస్తుల స్వీకరణ**




వెల్దుర్తి ఆర్ సి ఇన్చార్జి సెప్టెంబర్ 13 ; నేటి శుభోదయ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నూతనంగా ప్రారంభించిన మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. 5, 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశాల కోసం అర్హులైన బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ పరమేశ్వరరావు, ప్రిన్సిపల్ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హత కలిగిన బాలికలు ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం జత చేయాలని తెలిపారు. అలాగే విద్యార్థిని పూర్తి చిరునామా, తల్లిదండ్రుల ఫోన్ నంబర్లను తప్పనిసరిగా దరఖాస్తులో నమోదు చేయాలని పేర్కొన్నారు.ప్రవేశాలపై ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. మరిన్ని వివరాల కోసం 9010723711, 9014348654, 8317596367 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తో బడేటి చంటి భేటీ



ఏలూరు, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: ఆదివారం ఉదయం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ క్యాంపు కార్యాలయంకు వచ్చిన జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఎంపీతో భేటీ అయ్యారు. దాదాపు అరగంట సేపు జరిగిన ఈ భేటీలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణ, కూటమి నేతల మధ్య సమన్వయం, పార్టీ బలోపేతంపై చర్చించినట్లు తెలుస్తోంది. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమన్వయంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు ఎంపీ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

## గణనాథుడి కృపతో సుఖసంతోషాలు



పులిచెర్ల, సెప్టెంబర్ 13 (నేటి శుభోదయ): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పులిచెర్ల మండల ప్రజలకు ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుడి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, మండల ప్రజలు, అధికారులు, స్వర్ణ గ్రామం కార్యాలయ సిబ్బందికి ఆయన వినాయక చవితి శు భాకాంక్షలు తెలిపారు.

## విశ్వేశ్వరుని మట్టి విగ్రహాల పంపిణి




పెనమలూరు, సెప్టెంబర్ 13 నేటి శుభోదయ: యనమలకుదురు ఎన్టీఆర్ గార్డెన్ వద్ద మొక్కపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినాయకుని మట్టి విగ్రహాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు వెలగపూడి శంకర్ బాబు, రాష్ట్ర గౌడ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్ గౌడ్, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు.

## రైతులకు కరెంట్,సాగునీరు ఇవ్వని చేతకాని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం

**- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

**- రైతులను నట్టేట ముంచిన రేవంత్ రెడ్డి**

**- 24 గంటలు కరెంట్ ఇచ్చిన ఘనత కేసీఆర్ దే**

**- కేసీఆర్ ఆనాడే చెప్పిండు మోసపడితే గోసపడతారు అని - సాగునీరు, ఉచిత విద్యుత్ అందించిన కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష**

**- కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే తప్ప, చేతల ప్రభుత్వం కాదు**



ఖమ్మం, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామంలో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ సభలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.బిఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలతో రైతులు అల్లాడిపోతున్నారు.పగటిపూట ఉపాధి లేక, రాత్రివేళల్లో కరెంట్ లేక ఒళ్లు, కడుపు మండుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.3-ఫేస్ విద్యుత్ లేకపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోవడం వంటి పాత కాంగ్రెస్ రోజుల నాటి దుస్థితి మళ్లీ పునరావృతమైంది.కేసీఆర్ హయాంలో రైతులు దర్జాగా పొలాల్లో పనిచేసుకునే వారని, కానీ నేడు యూరియా బస్తాల కోసం యాప్‌ల పేరుతో రైతులను క్యూ లైన్లలో నిలబెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు.'రైతు బంధు' సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల రాజకీయం కోసమే వాడుకుంటోందని, పంటల సమయానికి రైతులకు సహాయం అందడం లేదని విమర్శించారు.రూ 2 లక్షల రుణమాఫీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క గ్రామంలోనూ పూర్తిగా అమలు చేయలేకపోయిందని, రఘునాథపాలెం మండలంలో ఏ గ్రామానికైనా వచ్చి బిఆర్ఎస్ సవాలును స్వీకరించాలని డిమాండ్ చేశారు.మహిళలకు నెలకు రూ 2,500 ఇస్తామని చెప్పి ఇప్పటివరకు మూడు సంవత్సరాల్లో రూ 75,000 వరకు బాకీ పడ్డారని లెక్కలతో సహా వివరించారు.కేసీఆర్ రూ 1,00,116 అందిస్తే, తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క మహిళకూ తులం బంగారం ఇవ్వలేదని దుయ్యబట్టారు.వృద్ధులకు రూ.4,000, వికలాంగులకు రూ.6000 పెన్షన్ ఇస్తామని చెప్పి మాట తప్పారని, అలాగే రూ 500 కే గ్యాస్ సిలిండర్ హామీ కేవలం మాటలకే పరిమితమైందని విమర్శించారు.కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ సస్యశ్యామలంగా మారిందని, రైతులకు నిజమైన భరోసా దక్కిందని నాయకులు స్పష్టం చేశారు. రైతాంగం మరియు ప్రజా సంక్షేమం కోసం బిఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు యాసా రామారావు,ఆర్జేసీ కృష్ణ,గుత్తా రవి,మాధంశెట్టి హరిప్రసాద్, కొంటెముక్కల వెంకటేశ్వర్లు,పిన్ని కోటేశ్వరరావు చెరుకూరి ప్రదీప్,దొంతు సత్యనారాయణ, హనుమంత్ రావు, ఎల్లబాబు,గోవర్ధన్, రవి,వినోద్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాగణపతి ఉత్సవాలకు మంగినపూడి బీచ్ ముస్తాబు

**అధికారులు చివరి వరకు సమన్వయంతో పనిచేయాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశం**



మచిలీపట్నం, సెప్టెంబర్ 13 నేటి శుభోదయ : మంగినపూడి బీచ్ తీరంలో ఈ నెల 14 నుంచి 11 రోజుల పాటు నిర్వహించనున్న మహాగణపతి ఉత్సవాలను అత్యంత ఘనంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆదివారం మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ఇతర అధికారులతో కలిసి మంగినపూడి బీచ్‌ను సందర్శించి మహాగణపతి ఉత్సవాల కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా 63 అడుగుల మహాగణపతి విగ్రహం ఏర్పాటు పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తి అయ్యి అంతా సిద్ధమైనట్టు తెలిపారు.ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు, సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, బ్యారికేడింగ్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. భక్తులకు తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.బీచ్ పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నిరంతరం పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉత్సవ ప్రాంగణంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా, స్టాల్స్ ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాలపై కూడా మంత్రి అధికారులతో సమీక్షించారు. ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. భక్తుల భద్రత, సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా గణనాథుని ఉత్సవాలను ఘనంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో మంత్రి వెంట ఏఎస్పి వీవీ నాయుడు, బందరు ఆర్డీవో కే సాంబశివరావు, కార్యక్రమ నిర్వహణ నోడల్ అధికారి డిఆర్డిఏ పీడీ హరిహరినాథ్, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, కమిటీ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.



## సమస్యలు చెప్పండి.పరిష్కరిస్తాం.. ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, సెప్టెంబర్ 13 (నేటి శుభోదయ):- తూర్పులోని 13వ డివిజన్ లక్ష్మిపతి నగర్‌లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఆదివారం ఉదయం పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అక్కడి వారిని అడిగి తెల్సుకుని వాటిని పరిష్కరించాల్సిందిగా కార్పోరేషన్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురైన టీడీపీ కార్యకర్త శ్రీమన్నారాయణ ఇంటికి వెళ్ళి గద్దె పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెల్సుకుని వాటిని పరిష్కరించడానికి తమ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తాను నిత్యం నియోజకవర్గంలోని డివిజన్లలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెల్సుకుని వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తున్నానని అన్నారు. డివిజన్‌లో స్థానికంగా ఉన్న సమస్యలను కూటమి పార్టీ నాయకుల దృష్టికి తీసుకువస్తే వాటిని వెంటనే పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో రహదారులను పునర్నిర్మాణం చేశామని, డ్రైనేజీ సమస్యను కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గద్దె చెప్పారు. ఈ కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, నూతి శ్రీను, కూరపాటి శ్రీను, సబ్బినేని పసి, షేక్ నాగూ, మాదిరెడ్డి రవి తదితరులు పాల్గొన్నారు.

## కీ.శే. ఇసనపల్లి నగేష్ గారి కుటుంబ సభ్యులను పరామర్శించిన స్వరమాలిక మన్నేపల్లి మల్లిఖార్జున్



ఖమ్మం, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: ఇటీవల రోడ్ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన స్వరమధురిమ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు ఇసనపల్లి నగేష్ యొక్క కుటుంబ సభ్యులను వారి స్వగ్రామం తిమ్మరావుపేట గ్రామంలో కేశినేని శ్రీలతతో కలిసి మల్లిఖార్జున్ పరామర్శించారు. అంతేకాకుండా వారి కుటుంబానికి భరోసా ఇస్తూ రూ 25000/- లు ఆర్థిక సాయం అందించారు. తోటి కళాకారుడి అకాల మరణానికి ఎంతగానో చింతిస్తున్నామని భవిష్యత్ లో కూడా వారి కుటుంబ సభ్యులకు ఎటువంటి ఇబ్బంది ఉన్నా మేమున్నాం అని భరోసా ఇచ్చారు.ఏది ఏమైనా ఆయన లేని లోటు ఆ కుటుంబానికి పూడ్చలేనిదని,దాతలు చేసే చిన్న సాయం ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాతో పాటు కొండంత ధైర్యాన్ని ఇస్తుంది.సాయానికి ముందుకొచ్చిన దాతలు అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో ప్రముఖ కీ బోర్డ్ ప్లేయర్ దామెర్ల నరసింహ రావు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. డీఎఫ్ఓ రవీంద్రనాథ్ రెడ్డి



చింతూరు, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని చింతూరు డిఎఫ్ ఓ రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా ఆదివారం చింతూరులో శ్రీ భాస్కర విద్యానికేతన్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో డిఎఫ్ఓ పాల్గొని ప్రసంగించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వల్ల పర్యావరణానికి చాలా ముప్పు ఉందని మట్టి గణపతి విగ్రహాలనే వినాయక చవితి పండుగకు ప్రతి ఒక్కరు వినియోగించాలని కోరారు. ఈ పంపిణీ కార్యక్రమంలో సిఐ గోపాలకృష్ణ మాట్లాడుతూ మట్టితో తయారుచేసిన గణపతి ప్రతిమలు వల్ల ఎటువంటి నష్టం ఉండదని, విద్యార్థులకు చిన్నప్పటి నుండే పర్యావరణం మీద అవగాహన కల్పించాలని కోరారు. అలాగే ఎస్సై సంతోష్ కుమార్ మాట్లాడుతూ పండుగలు శాంతియుతంగా సాంప్రదాయంగా జరుపుకోవాలని అన్నారు. శ్రీ భాస్కర విద్యానికేతన్ కరస్పాండెంట్ చిరసాని వేణుగోపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ముందుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎకడమిక్ కోఆర్డినేటర్ త్రివీణ, ప్రిన్సిపాల్ రాంబాబు, ఉపాధ్యాయులు రమేష్, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని ఆడ ఆ సామి ని సమాచారం ఇవ్వండి : ఎస్ఐ సంతోష్ కుమార్



చింతూరు, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: పోలవరం జిల్లా, చింతూరు మండలం కుమ్మూరు పంచాయతీ సింగన్నగూడెం గ్రామ శివారులో రోడ్డు వద్ద ఒక గుర్తు తెలియని వాహనం ఢీకొని పై ఫోటోలోని ఆడ వ్యక్తికి తలకు బలమైన రక్తపు గాయం అయ్యి చనిపోయినదని ఆమెను గుర్తించి తమకు సమాచారం ఇవ్వాలని చింతూరు సిఐ గోపాలకృష్ణ, ఎస్సై సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.. ఆమె శరీరంపై రెడ్ కలర్ జాకెట్, మెరూన్ కలర్ పూలతో కూడిన దుస్తులు ధరించి ఆమె ఎత్తు సుమారు 4.5 అడుగులు, వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చునన్నారు.. విఆర్ఓ రిపోర్టు ద్వారా చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సదరు ఆడ ఆసామి ఆచూకీ తెలిసిన వారు లేదా బంధువులు ఉన్నట్లయితే ఈ క్రింది నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించవలెనని కోరారు..సి ఐ. చింతూరు 9281442982 యస్ ఐ చింతూరు 9281442983.

## నిర్వాసితుల సమస్యలు పార్లమెంటులో ప్రస్తావిస్తా

**అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి**



చింతూరు, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: డివిజన్లోని నాలుగు మండలాల్లో పోలవరం నిర్వాసితులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, రాబోయే శీతాకాలం సమావేశాల్లో వాటిని పార్లమెంటులో ప్రస్తావించి నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తానని అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి భరోసానిచ్చారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇంఛార్జ్ నాగులపల్లి ధనలక్ష్మితో కలసి ఆమె చింతూరు మండలం కుమ్మూరులో పోలవరం నిర్వాసితుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే రెండ్రోజుల పాటు ఎటపాక, కూనవరం, వీఆరప్పురం, చింతూరు మండలాల్లో పర్యటించినట్లు తెలిపారు. భూములు, గృహాలు, ఆర్అండ్ఆర్. పరిహారం విషయంలో నిర్వాసితులకు తగిన రీతిలో న్యాయం జరగలేదని ఆమె పేర్కొన్నారు. కాంటూరు లెక్కల మాటున కూటమి ప్రభుత్వం ముంపు గ్రామాలను పట్టించు కోవడంలేదని, దీంతో వరదల సమయంలో గిరిజనులు అనేక కష్టాలు పడుతున్నారని ఆమె విమర్శించారు. 45.75 కాంటూరులో వున్న ఎన్నో గ్రామాలు చిన్నపాటి వరదలకే ముంపుకు గురవుతున్నాయని, వాటిని 41.25 కాంటూరులో కలపాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నా కూటమి ప్రభుత్వంలో చలనంలేదని ఆమె విమర్శించారు. 18 ఏళ్లు నిండిన చాలామందిని పరిహారం జాబితాలో చేర్చలేదని దీనివలన అనేకమంది యువతకు అన్యాయం జరుగుతుందని ఎంపీ పేర్కొన్నారు. కటాఫ్ తేదీతో సంబంధంలేకుండా గ్రామాలు ఖాళీచేసే నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఆర్ఎండ్ఆర్ పరిహారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేసారు. నిర్వాసితుల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించడంతో పాటు సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె హామీనిచ్చారు మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ 2022లో వచ్చిన వరదలకు ఈ ప్రాంత వాసులు పడిన కష్టాలను కళ్లారా చూసిన వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రాధాన్యతా క్రమంలో 32 గ్రామాలను ముంపులో చేర్చడం జరిగిందని. ప్రస్తుతం వారందరికీ పరిహారం అందుతుంటే కూటమి నాయకులు దానిని తమ గొప్పగా చెప్పుకుంటున్నారని విమర్శిచారు. కేంద్రంలో వేరేపార్టీ అధికారంలో వున్నా వైఎస్ జగన్ తన ప్రభావంతో 32 గ్రామాలను ముంపులో చేర్చడం జరిగిందని, ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే అధికారంలోనే వున్న గడిచిన రెండున్నరేళ్లలో ఒక్క గ్రామాన్ని కూడా ముంపులో చేర్చలేకపోయారని ఆమె ఎద్దేవా చేసారు. నిర్వాసితులు కోరుకున్నచోట పునరావాసం కల్పించకుండా, అర్హులకు పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ఆమె విమర్శించారు. కొందరు పోలవరం అధికారులు పరిహారం విషయంలో అర్హులకు అన్యాయం చేస్తూ అనర్హులకు పరిహారం ఇస్తున్నట్లు తెలిసిందని, మా పార్టీ అధికారంలోకి వచ్చాక అలాంటి అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని ధనలక్ష్మి హెచ్చరించారు. కూటమి నాయకుల కల్లబొల్లి మాటలను వైఎస్సార్సీపీ శ్రేణులు ఎవరూ నమ్మవద్దని, గడచిన రెండున్నరేళ్ల కాలంలో వారు ప్రజలకు చేసిందేమీ లేదని ఆమె విమర్శించారు. విలువిద్యలో బంగారు పతకం సాధించిన స్థానిక కుమ్మూరు యువకుడు అణిగి దుర్గయ్యకు అర్హత వున్నా డీఎస్సీలో టీచర్ పోస్టు రాలేదని, అనర్హులకు మాత్రం కూటమి ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాలో వుద్యోగాలు కట్టబెట్టిందని ఆమె ఆరోపించారు. అనంతరం వివిధ గ్రామాల నుండి వచ్చిన పోలవరం నిర్వాసితుల సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చిచ్చడి మురళి. ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, లో



అప్షన్ మెంబర్ ఎండీ జిక్రియా, పార్టీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, నాయకులు కోట్ల కృష్ణ, కురసం నాగేశ్వరరావు, రాంప్రసాద్, మురళి. మాజీ సర్పంచ్లు ముచ్చిక నాగార్జున, కారం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## కనుపాప చెదిరి.. కన్నోళ్లు కుమిలి..

**ఆగిన వాహనాన్ని ఢీకొన్న అంబులెన్సు చిన్నారి, డ్రైవర్ దుర్మరణం**



విజయవాడ (విద్యాధరపురం), సెప్టెంబర్ 13 నేటి శుభోదయ : విధిరాతను ఎవరూ తప్పించలేరనడానికి విజయవాడ బైపాస్లో జరిగిన రోడ్డు ప్రమాదమే నిదర్శనం అని చెప్పొచ్చు. అంబులెన్సులో మెరుగైన చికిత్స కోసం వస్తూ రోడ్డు ప్రమాదంలో బాలుడి తలకు గాయమై మృతి చెందాడు. ఇదే ఘటనలో అంబులెన్సు సపోర్ట్ డ్రైవర్ కాలు నుజ్జు అయ్యి తీవ్ర రక్తస్రావం కావడంతో ప్రాణాలు వదిలాడు. ఝార్ఖండ్ రాష్ట్రం రాంచి జిల్లా పర్తాడ్ గ్రామానికి చెందిన అక్స్ బరైక్(2)కు మెదడులో సమస్య రావడంతో అతడిని చికిత్స కోసం జార్ఖండ్ నుంచి తమిళనాడు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందడంతో బాలుడి కుటుంబ సభ్యుల వేదన వర్ణనాతీతం. బాలుడి తండ్రి రాజ్కుమార్, తల్లి బల్వంతుమారి, మేనమామ కందేజ్ బడాయ్లతో కలిసి అంబులెన్సులో ఈనెల 10న బయలుదేరారు. శనివారం విజయవాడ బైపాస్లో ఆగిఉన్న లారీని అంబులెన్సు ఢీకొంది. అంబులెన్స్ సపోర్టింగ్ డ్రైవర్ చోటన్ కుమార్ సోని(32) కాలు నుజ్జుకావడంతో తీవ్ర రక్తస్రావమై సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

# ప్రజలందరికీ వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు

**:ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**-ప్రజా వేదికలో...పురపాలక సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన,ప్రత్యేక వినాయక పాట ఆవిష్కరణ**

**-విఘ్నేశ్వరుడి కరుణతో ప్రజలందరికీ విఘ్నాలు తొలగి సుఖసంతోషాలు కలగాలి:ఎమ్మెల్యే రాము**

**మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణాన్ని కాపాడాలి**



గుడివాడ,సెప్టెంబర్ 13 నేటి శుభోదయ: గుడివాడ నియోజకవర్గ ప్రజానీకానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితి సందర్భంగా గుడివాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక సాంగును ఎమ్మెల్యే రాము ఆవిష్కరించారు. గుడివాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో 'స్వచ్ఛ గుడివాడ -- ప్రకృతిని కాపాడదాం' అనే సందేశంతో రూపొందించిన 'గుడివాడ గణపయ్య వచ్చాడయ్యా' పాటను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించారు.గుడివాడ గణపయ్య వచ్చాడయ్యా... మన ఇంట ఆనందం తెచ్చాడయ్యా ప్రకృతిని కాపాడదామంటూ స్వచ్ఛ గుడివాడను నిలబెడదాం' అనే సందేశంతో పాటను వినసొంపుగా రూపొందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ... వినాయక చవితి పర్వదినం ప్రతి ఒక్కరికీ ఎంతో ప్రత్యేకమైనదన్నారు. విఘ్నేశ్వరుడి కరుణాకటాక్షాలతో ప్రజలందరికీ విఘ్నాలు తొలగి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. మనందరం ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే అతి పెద్ద పండుగల్లో వినాయక చవితి ప్రథమంగా ఉంటుందని అన్నారు. పండుగ ప్రాముఖ్యతను మరింత పెంపొందించేలా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. గుడివాడ పురపాలక సంఘానికి కూడా విఘ్నాలు తొలగి, మున్సిపల్ ఎన్నికలు సజావుగా జరిగి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగాలని ఆకాంక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా జరిగేలా స్వామివారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గుడివాడ మరింత అభివృద్ధి చెందాలని, పట్టణంలో మౌలిక వసతులు మరింత మెరుగుపడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలు మరింత శోభాయమానంగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం గణపతి మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేడుకలు నిర్వహించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని, మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఇంటా, ప్రతి వీధిలో ఉత్సవాలు వైభవంగా జరగాలని, అదే సమయంలో పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పండుగ ముగిసిన అనంతరం పరిసరాలను శుభ్రంగా ఉంచే బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.గుడివాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంచి ఆలోచనతో, భక్తి సందేశంతో పాటు పర్యావరణ పరిరక్షణ అంశాన్ని మిళితం చేస్తూ పాటను రూపొందించడం అభినందనీయమని ఎమ్మెల్యే రాము అన్నారు. ప్రజల్లో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన కల్పించేలా ఇటువంటి కార్యక్రమాలు కొనసాగించాలని మున్సిపల్ అధికారులను అభినందించారు.వినాయకుడి ఆశీస్సులతో గుడివాడ నియోజకవర్గ ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు. ప్రజలందరూ సోదరభావంతో, భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య,బిజెపి నాయకులు అంగడాల సతీష్, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, మజ్జాడ నాగరాజు, గుత్తా చంటి, శ్రీ కొండలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ఈడే మోహన్,పెద్దూ వీరభద్రరావు, వసంత వాడ దుర్గారావు, దేవాది నాగేశ్వరరావు , తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు

**ప్రజలు పర్యావరణ హిత మట్టి విగ్రహాలను పండుగలో వినియోగించండి**



అనంతపురము, సెప్టెంబర్ 13: నేటి శుభోదయ : వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో పర్యావరణ హితంగా ఉత్సవాలు జరుపుకోవాలని, పండుగ శుభాకాంక్షలను మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి తెలిపారు.వినాయక చవితి ఎంతో పవిత్రమైన పండుగ అని, అన్ని విఘ్నాలను, సంకటాలను హరించి విజయాన్ని అందించే వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలందరి ఇంటా విఘ్నాలు తొలగి వారు ఆయు ఆరోగ్యాలతో, సుఖ సంతోషాలతో, సౌభాగ్యాలతో సిరి సంపదలతో తుల తూగాలని సుహృద్భావ వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని, సహజ రంగులతో తయారు చేసిన మట్టి విగ్రహాలను ఉపయోగించాలని, పర్యావరణానికి హాని చేసే కృత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాలను వాడరాదని, ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడేలా మట్టి వినాయకులని ఉపయోగించాలని, సామరస్య, శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

## మల్కాజ్‌గిరిలో ఘనంగా బీజేపీ 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యశాల



మల్కాజ్‌గిరి, సెప్టెంబర్ 13 నేటి శుభోదయ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాప్రతినిధిగా, ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల నిరంతర ప్రజాసేవను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ నేతలు వెల్లడించారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి అసెంబ్లీ పరిధిలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో 'సేవా సంకల్ప్ అభియాన్' సన్నాహక కార్యశాల ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం జిల్లా సేవా సంకల్ప్ అభియాన్ కో-కన్వీనర్ ఉడుత నవీన్, మల్కాజ్‌గిరి అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ బాలచందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపు రమణారెడ్డి, మాణిక్య రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలనలో దేశం అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా ఎదుగుతోందని కొనియాడారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న మోదీ నాయకత్వ స్ఫూర్తితో నియోజకవర్గంలోని ప్రతి బస్తీ, కాలనీల్లో నెల రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో నాయకులు వి.కె. మహేష్, ప్రియతం రామకృష్ణ, వాసంశెట్టి శ్రీనివాస్, శ్రీనివాస్ ముదిరాజ్, రమేష్ గౌడ్, సత్యనారాయణ, సాయిబాబా, ఆదిత్య, శివ, శ్రీకాంత్ యాదవ్, సోమ శ్రీనివాస్, లక్ష్మణ్, ధనరాజ్, లింగారావు, కిషోర్, మల్లికార్జున్, మహిళా నేతలు సుజాత, పద్మిని, సుశీల తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐచర్ వాహనం ఢీకొని బాలిక దుర్మరణం



యాడికి సెప్టెంబర్ 13 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : అనంతపురం జిల్లా యాడికి మండలం వేములపాడు సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భీమునిపల్లికి చెందిన కంబగిరి తన కుమార్తె వనిజతో కలిసి తాడిపత్రి ఆసుపత్రికి వెళ్లారు. అనంతరం తిరిగి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో వేములపాడు వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన ఐచర్ వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టి, బాలిక వనిజ పైనుంచి వెళ్ళింది. ఈ తీవ్ర ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలిక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## యాడికిలో మిన్నంటిన వినాయక చవితి సంబరాలు

**మండపాల్లో కొలువుదీరిన బొజ్జ గణపయ్య**



యాడికి సెప్టెంబర్ 13 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :మండల కేంద్రంలో వినాయక చవితి పండగ సందడి అంబరాన్ని తాకింది. వీధి వీధినా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతుండగా, గణేష్ నవరాత్రి ఉత్సవాలకు యాడికి పట్టణం సిద్ధమైంది. సకల విఘ్నాలను తొలగించి, విజయాలను ప్రసాదించే ఆదిదేవుడు, విఘ్నేశ్వరుడి రూపకల్పనకు భక్తులు బ్రహ్మరథం పడుతున్నారు. ఏ ఆటంకం రాకుండా ఏ పని ప్రారంభించినా తొలిపూజ అందుకునే లంబోదరుడి ఉత్సవాలు మండల వ్యాప్తంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు ఎంతో ఉత్సాహంగా వివిధ రూపాల్లో ఉన్న గణనాథుడి విగ్రహాలను తెచ్చి, సర్వాంగ సుందరంగా అలంకరించిన మండపాల్లో




ప్రతిష్ఠించారు. తొలిరోజున వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.పట్టణంలోని ప్రధాన కూడళ్లు, కాలనీలలో ఉత్సవ కమిటీ సభ్యులు ఉత్సాహంగా పందిళ్లు వేసి, రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో పండగ వాతావరణాన్ని తీసుకువచ్చారు. మండపాల వద్ద భక్తిపాటల మైకుల హోరు, పూజలు చేసే భక్తుల రద్దీతో మండల కేంద్రం కలకలలాడుతోంది. ఉదయం నుంచే భక్తులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్య వీధిలో ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక ఘట్టానికి శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోనే తొలిసారిగా లోక కళ్యాణార్థం సిద్ధి బుద్ధి సమేత వినాయక కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆర్యవైశ్య సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఈ అరుదైన మరియు పవిత్రమైన కళ్యాణ మహోత్సవానికి మండలంలోని భక్తజనులందరూ విశేష సంఖ్యలో హాజరై, స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని ఆర్యవైశ్య ప్రముఖులు కోరారు.ఇక ఇళ్ల వద్ద కూడా వినాయక చవితి సందడి స్పష్టంగా కనిపిస్తోంది. పండగ కోసం మార్కెట్లు పత్రి, పండ్లు, పువ్వులతో కిటకిటలాడాయి. ఇంట్లో ప్రతిష్ఠించిన సిద్ధి వినాయకుడికి ఇష్టమైన ఉండ్రాళ్లు, కుడుములు నివేదించి, స్వామివారి కృప కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల వ్యాప్తంగా ఎటు చూసినా "గణపతి బప్పా మోరియా" నామస్మరణతో భక్తి పారవశ్యం అలుముకుంది..

## వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

**-మట్టి గణపతులనే పూజించాలని ప్రజలకు పిలుపు**

**=పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : యార్లగడ్డ**



గన్నవరం, సెప్టెంబర్ 13 నేటి శుభోదయ: వినాయక చవితి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలతో పాటు గన్నవరం నియోజకవర్గ ప్రజలందరికీ ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శుభాకాంక్షలు తెలిపారు. ఏ శుభకార్యానికైనా తొలి పూజ విఘ్నేశ్వరుడికే చేయడం భారతీయ సంప్రదాయమని పేర్కొన్నారు. మహా గణాధిపతి అనుగ్రహంతో ప్రజలందరి కోరికలు నెరవేరాలని, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని... ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టితో తయారు చేసిన సహజ వినాయక విగ్రహాలనే పూజించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మట్టి గణపతులను పూజిస్తూ పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తున్న వారందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం – ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్‌లి



అనంత పురం ఈ సెప్టెంబర్,13: నేటి శుభోదయ : శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ వినాయక చవితి పండగ శుభాకాంక్షలు తెలిపారు.విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలందరూ గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఆధ్యాత్మిక భావనతో జరుపుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని పిలుపునిచ్చారు. ఉత్సవ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ, పోలీసు స్థానిక యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

**ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్**



ఏలూరు, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ :: ఏలూరు పార్లమెంట్ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. ఏ పూజ అయినా, ఏ నూతన కార్యమైనా, ఏ పనైనా మొదలుపెట్టేముందు ముందుగా వినాయకుడిని తలుచుకుని, ఆయనకు నమస్కరించి మొదలుపెడితే, ఎటువంటి విఘ్నాలు లేకుండా ఆ పని నిర్విఘ్నంగా జరిగేట్లుగా వినాయకుడు చూస్తాడన్నారు. అన్ని రకాల విఘ్నాలు తొలగించి సమస్త శుభాలను ప్రసాదించే దేవుడు విఘ్నేశ్వరుడన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం వీలైనంతవరకు ప్రతి ఒక్కరు ప్రకృతి హితంగా “మట్టి గణపతిని” ఏర్పాటు చేసుకుని పూజలు చేయవలసిందిగా ఎంపీ ప్రజలను కోరారు. అదేవిధంగా గణేష్ మండపాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసులు, అధికారుల సూచనలు పాటించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గణేష్ మండపాల నిర్వాహకులకు సూచించారు. చిన్నా, పెద్దా అందరికీ ఇష్టమైన పండుగ వినాయక చవితి అన్న ఎంపీ, చిన్ననాటి నుంచి తమ కుటుంబంలో వినాయక చవితిని ఘనంగా చేసుకోవడం అలవాటు అన్నారు. ఈ సంవత్సరం ఏలూరు పార్లమెంట్ ప్రజలకు మరింత అందుబాటులో ఉండేందుకు కొత్తగా నిర్మించుకున్న శాశ్వత నివాసంలో, ప్రజలు, కార్యకర్తల మధ్య పండుగ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏలూరు పార్లమెంట్ అభివృద్ధికి తాను తలపెట్టిన పనులన్నీ ఎటువంటి విఘ్నాలు లేకుండా, తలపెట్టిన ప్రతి కార్యం విజయవంతం కావాలని, అదే విధంగా జిల్లా లోని ప్రజలంతా ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియచేశారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులు

**కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిమల పంపిణీ.. విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం**



బాపట్ల నేటి శుభోదయ (రవి కిరణ్), సెప్టెంబర్ 13:పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ లక్ష్యంగా అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకులు విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలో పలుచోట్ల మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత మట్టి గణపతి ప్రతిమలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఇందులో భాగంగా పట్టణంలోని భావనారాయణ స్వామి ఆలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ తన చేతుల మీదుగా ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ జరగడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అనంతరం విన్నకోట సురేష్ ప్రత్యేకంగా రూపొందించిన పెద్ద మట్టి వినాయక ప్రతిమను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్‌కు తన చేతుల మీదుగా సాదరంగా అందజేశారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన కలెక్టర్‌కు ప్రత్యేక మట్టి వినాయక ప్రతిమను అందించడం కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ప్రతిమల వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా, పర్యావరణానికి హాని కలగకుండా మట్టి వినాయకులను వినియోగించాలని ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రజలకు సూచించారు. భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. అనంతరం బాపట్ల పట్టణ సీఐ రాంబాబు, తహసీల్దార్ షాలిమా చేతుల మీదుగా కూడా పలువురికి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అఖండ ఫౌండేషన్ ప్రతినిధులు వంగపాటి శివయ్య, చేజర్ల సతీష్, గొర్ల ఆంజనేయులు, ఎనుముల సుధాకర్ రెడ్డి, పులిగడ్డ శ్యాం ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు గొట్టిపాటి శ్రీకృష్ణ, అంజనేష్ తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమలను అందించిన విన్నకోట సురేష్‌ను ప్రజలు అభినందించారు. భక్తులకు పర్యావరణహితమైన ప్రతిమలను అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## యాడికిలో ఘనంగా వినాయక చవితి వేడుకలు: 14న నవగ్రహ సహిత తొమ్మిది రకాల హోమాలు, 15న శ్రీ సిద్ధి బుద్ధి సమేత వినాయక కళ్యాణం



యాడికి సెప్టెంబర్ 13 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, ఆర్యవైశ్య యువజన సంఘం నేతృత్వంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఉత్సవాల్లో భాగంగా ముందుగా స్వామివారి విగ్రహాన్ని పట్టణంలో వైభవంగా ఊరేగించారు. ఈ శోభా యాత్రలో మహిళలు దారినెడుతూ దివ్య దీపాలతో స్వాగతం పలకగా, భక్తి పాటల నృత్యాలు, చిన్నారుల బాణాసంచా కాల్పులు, డీజే డాన్సుల కోలాహలం మధ్య ఊరేగింపు అత్యంత వైభవంగా సాగింది.లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ ఈ నెల 14వ తేదీన తొమ్మిది రకాల ప్రత్యేక హోమాలను, 15వ తేదీన శ్రీశ్రీశ్రీ సిద్ధి బుద్ధి సమేత వినాయక స్వామివారి కళ్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అనంతరం యాడికి పట్టణ ప్రజలందరికీ ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని (విందు భోజనాలు) ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఆర్యవైశ్య పెద్దల సూచనలు, సలహాలతో ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని, స్వామివారి కృపాకటాక్షాలతో రాబోయే కార్యక్రమాలన్నీ విజయవంతమవుతాయని యువజన సంఘం సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు బంగారు బాల, పవన్, సత్యాలు, రాము ప్రసాద్‌తో పాటు యువజన సంఘం సభ్యులు రవితేజ, కేదార్, సాయి, రాఘవ, అర్జున్, పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## పాతబస్తీ లో మహిళా బీ ఎల్ ఓ పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

పాతబస్తి, సెప్టెంబర్ 13 నేటి శుభోదయ :పాతబస్తీలో మహిళా బీఎల్ఓ అధికారిపై దాడి అత్యంత హేయం: బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

హైదరాబాద్: పాతబస్తీ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న మహిళా బూత్ లెవల్ ఆఫీసర్ పై జరిగిన భౌతిక దాడి, వేధింపుల ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం.కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియలో భాగంగా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్న ఒక మహిళా అధికారి అని కూడా చూడకుండా, అసభ్యంగా ప్రవర్తిస్తూ మూకుమ్మడిగా దాడికి పాల్పడటం తీవ్ర దుర్మార్గం. విధి నిర్వహణలో ఉన్న మహిళా ఉద్యోగిని ఇంటికి వెళ్లకుండా అడ్డుకుని, ప్రాణహాని తలపెట్టేలా బెదిరింపులకు దిగడం పాతబస్తీలో కొనసాగుతున్న అరాచక సంస్కృతికి నిదర్శనం. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన ఓటర్ల జాబితా రూపకల్పన బాధ్యతలు చూస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందికే రక్షణ లేకపోవడం అత్యంత శోచనీయం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితులపై ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఉదాసీనత వీడి తక్షణమే స్పందించాలి.



**మా ప్రధాన డిమాండ్లు**

క్రిమినల్ కేసులు నమోదు: మహిళా అధికారిపై దాడి, దౌర్జన్యానికి పాల్పడిన నిందితులపై తక్షణమే నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారిని అరెస్టు చేయాలన్నారు. ఈసీఐ అండ్ సీఈవో జోక్యం: ఈ ఘటనపై భారత ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి తక్షణమే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించాలని, సిబ్బందికి భద్రత క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలు, ఇతర సిబ్బందికి పూర్తిస్థాయి పోలీస్ రక్షణ కల్పించాలని,ప్రభుత్వ బాధ్యత శాంతిభద్రతలను కాపాడటంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం నిందితులపై నిర్భయంగా చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలి.శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, మహిళా ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే శక్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని డిమాండ్ చేశారు.

## మేడిపల్లిలో మాజీ ఎమ్మెల్సీ సామినేని హిమంతరావు గారు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

**- అనంతరం మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ నివాసంలో ముఖ్య నాయకుల సమావేశం**

**- కాంగ్రెస్ వైఫల్యాలపై నిప్పులు చెరిగిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్**



ఖమ్మం, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: ముదిగొండ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన సామినేని హిమంతరావు సతీమణి సరస్వతి ఇటీవల మరణించడంతో, వారి స్వగృహానికి వెళ్లి వారి తనయుడు సామినేని రమేష్, కుటుంబ సభ్యులను శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్ ముఖ్య నాయకులతో కలిసి పరామర్శించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం మేడిపల్లి గ్రామంలోని మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ నివాసంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ**

తెలంగాణ తెచ్చిన నాయకుడు కేసీఆర్ ఆర్థిక, అంగ, కుల బలాలు ఏవీ లేకున్నా కేవలం ఆత్మవిశ్వాసంతో, తెలంగాణ ప్రజల బాగు కోసం ఉద్యమ జెండా ఎత్తి రాష్ట్రాన్ని సాధించిన మహోన్నత నేత కేసీఆర్. ఏ రోజూ ఉద్యమంలో పాల్గొనని వారు, జై తెలంగాణ అనని వారు నేడు కేసీఆర్ ని విమర్శించడం హాస్యాస్పదం.

- కేసీఆర్ పాలనే స్వర్ణయుగం తెలంగాణ వచ్చిన పదేళ్లలోనే రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ ధనిక రాష్ట్రంగా, అత్యధికంగా ధాన్యం పండించే అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్ ది. రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబీమా, ఆసరా పెన్షన్లు (రూ. 2000), కళ్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలను కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి గడపకూ అందించాం.

దివాలా తీసిన కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటినా ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదు. కనీసం ముఖ్యమంత్రి సొంత ఊర్లోనే కరెంటు లేక రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేసే దుస్థితి వచ్చింది. కరెంట్ లేక, సాగునీరు రాక, ఎరువుల కోసం యాప్‌ల పేరిట రైతులను ముప్పతిప్పలు పెడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అనేది ఆరిపోయే గుడ్డి దీపం లాంటిది; నిధులు లేక ప్రభుత్వ భూములు అమ్ముకుంటూ రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్నారు.

- ప్రజాస్వామ్య గొంతు నొక్కుతున్న వైనం ప్రజా సమస్యలపై శాసనసభలో గళమెత్తేందుకు నల్ల చొక్కాలు ధరించి వెళ్లిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసులను, మార్షల్స్‌ను ఉసిగొల్పి భౌతిక దాడులు చేయించడం కాంగ్రెస్ అహంకారానికి నిదర్శనం. మాజీ మంత్రులు, మహిళా నేతలని కూడా చూడకుండా దుర్మార్గంగా వ్యవహరించారు.

**- అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం**

దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీలు, అగ్రవర్ణ పేదలు, అందరికీ సమన్యాయం చేసిన పార్టీ బీఆర్ఎస్. గోరటి వెంకన్న, రసమయి బాలకిషన్ వంటి కళాకారులను, ఉద్యమకారులను చట్టసభలకు పంపి సముచిత గౌరవం ఇచ్చాం. దళితబంధు పథకాన్ని ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కూడా సంపూర్ణంగా అమలు చేసిన ఘనత కేసీఆర్ దే.

**- కార్యకర్తలకు కొండంత అండగా ఉంటాం**

రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో రాజీలేని పోరాటం చేయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు, తప్పుడు కేసులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. పోలీస్ స్టేషన్, ఎంఆర్వో ఆఫీస్, కలెక్టరేట్ ఎక్కడైనా సరే పార్టీ శ్రేణులకు నాయకత్వం వెన్నంటి ఉంటుంది. భవిష్యత్తు బీఆర్ఎస్‌దే; కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయం. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, బెల్లం వేణుగోపాల్, భాషబోయిన వీరన్న, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ మాజీ మండల కార్యదర్శి గడ్డం వెంకటగౌడ్, మాజీ జడ్పీటీసీ వరప్రసాద్, నాయకులు ఇంటూరి శేఖర్, రైతు సమన్వయ సమితి మండల మాజీ కోఆర్డినేటర్ పోట్ల వెంకటప్రసాద్ సీనియర్ నాయకులు బంక మల్లయ్య ఎస్సీ బీసీ మైనార్టీ సెల్ మాజీ మండల అధ్యక్షులు చెరుకుపల్లి బిక్షం, నాయకులు తోట ధర్మారావు షేక్ కాజా, బలుసు మురళీకృష్ణ, మహమ్మద్ చందు, సమన్వయ నాయకులు బత్తుల వెంకట్రావు మండల నాయకులు పచ్చా సీతారామయ్య, కోటి అనంత రాములు, ఎర్ర వెంకన్న, పునుకుల కోటేష్ యాదవ్, కొమ్మూరి రమేష్, కోడె బాబు షేక్ లాలు, మల్లేపల్లి శంకర్, కొత్తపల్లి నాగార్జున, సామినేని నాగభూషణం, పాము సిలవరాజు, పడిశాల భద్రయ్య, సంజీవరెడ్డి, రంగా రెడ్డి, సమరబోయిన వీరబాబు, వడ్డెల్లి కిరణ్, వీరయ్య, నెల్లూరి హనుమంతరావు తదితర కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## యూసీజీకి వ్యతిరేకంగా వెంకటాపురంలో రైతులు, ప్రజలు నిరసన

**- బొగ్గు ఆధారిత గ్యాస్ ఉత్పత్తి వలన పర్యావరణానికి తీవ్ర ముప్పు**



చింతలపూడి (వెంకటాపురం) సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: ప్రతిపాధిత బొగ్గు అధారిత గ్యాస్ ఉత్పత్తి ప్రాజెక్టు (యూసీజీ)కి వ్యతిరేకంగా చింతలపూడి మండలం, వెంకటాపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూజీసీ వద్దు మా గ్రామమే ముద్దు..రిలయన్స్ కు మా భూములు ఇవ్వం.. మాభూమి- మాహక్కు అంటూ నినాదాలు చేశారుఅనంతరం యూసీజీ ప్రాజెక్టు పై రైతులు, ప్రజల సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ యూసీజీ ప్రాజెక్టు వలన పర్యావరణానికి తీవ్ర ముప్పు ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు భూములు కోల్పోవడమే కాకుండా ప్రజలు గ్రామాల్లో నివసించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రైతుల పంటలు పూర్తిగా నాశనం అవుతాయని, ప్రపంచంలోని అనేక అనుభవాలు బట్టి తెలుస్తోందన్నారు. లక్షల కోట్ల రూపాయల ప్రజా సంపదను రిలయన్స్ కంపెనీకి కట్టబెట్టడం కోసం ప్రభుత్వాలు ఏకపక్ష నిర్ణయాలు చేయడం తగదన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా రైతుల భూములను, బొగ్గు గనులను రిలయన్స్ కంపెనీకి ఏ విధంగా కట్టబెడతారని ప్రశ్నించారు. యూసీజీ ప్రాజెక్టు వద్దు.. మా భూములు మా గ్రామాలే ముద్దు అని ప్రజలు, రైతులు నిలదీస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులు, ప్రజలు సమరశీల ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి. పాండు రంగారావు,సీఐటీయూ జిల్లా నాయకులు ఆర్ వి ఎస్ నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జి. వెంకట్రావు,సత్యనారాయణ,రైతులు మధు బాబు, వై. సాయి, ఫణీంద్ర, సుబ్బారావు, ఖాదర్ బాబు, మాదాసు శ్రీనివాసరావు, బి. కోటేశ్వరరావు, హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడి రాక, ప్రతి ఇంట శుభాల వేడుక

**ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు**

ఖమ్మం, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.విఘ్నాలను తొలగించే గణనాథుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం ఆనందంగా, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు.వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా నిర్వహించాలని ఎంపీ రఘురాం రెడ్డి సూచించారు. మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి, ప్రకృతిని కాపాడే విధంగా పండుగను జరుపుకోవాలని ప్రజలను కోరారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రతి ఇంటా శుభాలు, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## ఐక్య పోరాటాలే ఏచూరికి అర్పించే నివాళి



ఖమ్మం, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ ::: ఐక్య పోరాటాలే సీతారాం ఏచూరికి అర్పించే నిజమైన నివాళి అని న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ స్పష్టం చేశారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం సీపీఎం నేత సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు.వర్తమాన పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నూతన పోరాట వేదికలను మలచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఫాసిస్టు ధోరణులు, సిద్ధాంతాలతో పరిపాలిస్తున్న పాలకులు శాశ్వతంగా అధికారంలో ఉండేందుకు రకరకాల కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గతంలో ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ వంటి చర్యలు చూసేవారమని, కానీ నేటి పాలకులు బహిరంగంగా ఓటర్ల జాబితాలనే తారుమారు చేస్తున్నారని ధ్వజమెత్తారు.ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరిట రాత్రికి రాత్రే గ్రామీణ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఓటర్లు మాయమైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఓట్లు తొలగించబడ్డాయనే విషయం కూడా సామాన్య ప్రజలకు తెలియని పరిస్థితి కల్పించారని, తిరిగి ఆ ఓటు హక్కును పొందేందుకు దరఖాస్తులు చేసుకుంటూ కోర్టులు, అధికారుల చుట్టూ తిరగడం ఎంతో ప్రయాసతో కూడుకున్న పనిగా మారిందని పేర్కొన్నారు.అధికార బలం, ధనబలం, ప్రభుత్వ యంత్రంగంతో పాటు ఎన్నికల సంఘం వంటి వ్యవస్థలను కూడా తమకు అనుకూలంగా మార్చుకుని పాలకులు విసురుతున్న కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గతంలో సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన గురుతర బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కుతంత్రాలను బట్టబయలు చేస్తూ, బూత్ స్థాయిలో ప్రజలను సమీకరించి వారి ఓటు హక్కును కాపాడేలా చైతన్యపరచడమే ముందు మనం చేపట్టాల్సిన ప్రధానమైన పోరాటమని పురకాయస్థ వివరించారుప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్ కేవలం సమాచార మార్పిడి సాధనం మాత్రమే కాదని, అది వ్యక్తుల భావప్రకటన, స్వేచ్ఛ, జీవన విధానంలో అంతర్భాగంగా మారిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న జెన్-జీ నిరసనల నేపథ్యంలో సెల్‌ఫోన్ల ప్రాధాన్యతను విశ్లేషిస్తూ కీలక విషయాలను వెల్లడించారు. భావప్రకటనా స్వేచ్ఛ, రాజకీయ విమర్శలుమొబైల్ ఫోన్లు, వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాన ఆలోచనలు కలిగిన వ్యక్తులు ఏకమవడమే కాకుండా, తమ సంతోషాలు, బాధలు, నిరసనలను వ్యక్తపరుస్తున్నారని పేర్కొన్నారు. నిరంకుశ విధానాలను అవలంబించే ప్రభుత్వాలు లేదా నాయకులను హాస్యం, వ్యంగ్య చిత్రాలు (కార్టూన్లు), సందేశాల ద్వారా ప్రశ్నించే శక్తిని ఈ డిజిటల్ సాధనం సామాన్యులకు అందించిందని తెలిపారు. ఇటువంటి సున్నితమైన భావప్రకటనలను అణచివేయడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదని స్పష్టం చేశారు.ఈనాటి జెన్-జీ యువత సాంకేతికతతోనే పెరిగారని, పరీక్షల పేపర్ లీకేజీలు వారి భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.?ఏళ్ల తరబడి కోచింగ్ సాధన కోసం పడే శ్రమ, కుటుంబాలు భరించే ఆర్థిక భారం వృధా అవుతున్నాయి.పరీక్షల రద్దు, వాయిదాల వల్ల విద్యార్థుల భవిష్యత్తు నిరీక్షణ మరింత సుదీర్ఘమవుతోంది. ?తమ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీసేందుకు యువత డిజిటల్ వేదికలను ప్రధాన సాధనంగా ఎంచుకుంటోందన్నారు.సమాజంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి, ఉమ్మడి లక్ష్యాలను నిర్దేశించుకుని పోరాడటానికి సెల్‌ఫోన్ ఒక శక్తివంతమైన ప్రజా సమాచార సాధనంగా రూపాంతరం చెందిందని ఈ నిరసన ఉద్యమాలు స్పష్టం చేస్తున్నాయి.సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ లౌకిక, సమాఖ్య సూత్రాలను కాపాడటమే సీతారాం ఏచూరికి నిజమైన నివాళి అని సీపీఎం సీనియర్ నేత తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికల్లో ఓట్లేసి గెలవడం మాత్రమే కాదని, రాజ్యాంగం నిర్దేశించిన లౌకిక, సమాఖ్య స్ఫూర్తిని కాపాడుకోవడమేనని తెలిపారు. కామ్రేడ్ సుందరయ్య తర్వాత తెలుగు నేలపై అంతటి ప్రజాదరణ పొందిన కమ్యూనిస్ట్ నాయకుడు సీతారాం ఏచూరియేనని కొనియాడారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -“APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,“D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

# వైరల్ ట్రెండ్‌లో ప్రియాంక.. తన 'చిక్' మూమెంట్స్ ఇవేనట!



గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉంటారు. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్న 'కైండా చిక్' ట్రెండ్‌లో భాగమయ్యారు. శనివారం తన అధికారిక ఖాతాలో కొన్ని ఫొటోలను షేర్ చేస్తూ, తన జీవితంలో ఏయే అంశాలు తనకు స్టైలిష్‌గా, ప్రత్యేకంగా అనిపిస్తాయో వివరించారు. "30 ఏళ్ల వయసులో జీవితాన్ని మళ్లీ కొత్తగా ప్రారంభించడం, ఎలాంటి ప్రణాళిక లేకుండానే ఖండాలు దాటి వెళ్లడం, ఎదుటివారు మనల్ని తక్కువగా అంచనా వేయడం" వంటివి తనకు 'చిక్' అనిపిస్తాయని ప్రియాంక పేర్కొన్నారు. వీటితో పాటు "మెట్ గాలాలో నా భర్తను కలవడం, ఎటువంటి వివరణ ఇవ్వకుండా నిర్మొహమాటంగా 'నో' చెప్పగలగడం, ఇస్రో మెయిలింగ్ లిస్ట్‌లో ఉండటం" వంటి ఆసక్తికర విషయాలను కూడా పంచుకున్నారు. "ఈ ట్రెండ్‌ను ద్వేషించడం కూడా ఒక రకమైన చిక్" అంటూ ఈ పోస్ట్‌కు సరదాగా క్యాప్షన్ జతచేశారు. స్వీయ ప్రేమను, ఆత్మవిశ్వాసాన్ని చాటిచెప్పడమే ఈ ట్రెండ్ ప్రధాన ఉద్దేశం. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి మరిన్ని విశేషాలను తెలియజేస్తూ.. "నా బాలీవుడ్ హీరోను పెళ్లి చేసుకోవడం, నా ప్రాణ స్నేహితురాలి బిడ్డతో నా బిడ్డ బెస్ట్ ఫ్రెండ్ అవ్వడం, ఒక చిన్నారికి సురక్షితమైన ప్రపంచాన్ని అందించడం" కూడా చిక్ మూమెంట్స్ అని తెలిపారు. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రియాంక చోప్రా త్వరలో ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'వారణాసి' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో ఆమె మహేశ్ బాబు సరసన 'మందాకిని' అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా నటిస్తున్న ఈ చిత్రం.. 'శాంభవి' అనే గ్రహశకలం నుండి వారణాసి నగరాన్ని కాపాడటం అనే కథాంశంతో భారీ యాక్షన్-అడ్వెంచర్‌గా తెరకెక్కనుంది. ఈ చిత్రం 2027 ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్న 'కైండా చిక్' ట్రెండ్‌లో చేరిన ప్రియాంక

తనకు స్టైలిష్‌గా అనిపించే పలు విషయాలను పంచుకున్న గ్లోబల్ బ్యూటీ

30 ఏళ్లలో మళ్లీ మొదలుపెట్టడం, మెట్ గాలాలో భర్తను కలవడం 'చిక్' అని వెల్లడి

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు సరసన 'వారణాసి' చిత్రంలో నటిస్తున్న ప్రియాంక



# మంచి కథలతో రండి.. అవకాశమిస్తాం...



## కొత్త దర్శకులకు అక్కినేని నాగార్జున బంపర్ ఆఫర్



స్టూడియో అంటే కేవలం డబ్బులు సంపాదించడం మాత్రమే కాదన్న నాగార్జున

సినీ రంగానికి తిరిగి సేవ చేయాలనేది తన అభిమతమని వెల్లడి

మంచి కథ ఉన్నవారు నేరుగా అన్నపూర్ణ స్టూడియోను సంప్రదించవచ్చన్న నాగార్జున

మంచి కథలతో వచ్చే కొత్తవారికి అవకాశాలు ఇచ్చి సినిమాలు నిర్మించేందుకు తమ అన్నపూర్ణ స్టూడియోస్ సిద్ధంగా ఉందంటూ టాలీవుడ్ 'కింగ్' అక్కినేని నాగార్జున అదిరిపోయే ప్రకటన చేశారు. 'పళ్ళ బురుసు' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... మంచి కథ ఉన్నవారు ఎవరైనా సరే నేరుగా అన్నపూర్ణ స్టూడియోను సంప్రదించవచ్చని పిలుపునిచ్చారు. స్టూడియో అంటే కేవలం లీజుకు ఇచ్చి డబ్బులు సంపాదించడం మాత్రమే కాదని, తిరిగి సినీ రంగానికి సేవ చేయాలనే ఉద్దేశంతోనే కొత్త దర్శకులతో చిత్రాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల 'లెనిన్' సినిమాతో మంచి విజయాన్ని సాధించామని, ఇప్పుడు 'పళ్ళ బురుసు' నిర్మించి రిలీజ్ చేస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో 'రంభ, ఊర్వశి, మేనక'తో పాటు తన ప్రతిష్ఠాత్మక 100వ చిత్రం 'కింగ్ 100' కూడా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రాబోతున్నట్లు నాగార్జున వెల్లడించారు. కాగా, గోమతి రెడ్డి, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మా ప్రధాన పాత్రల్లో ఉదయ్ చౌహాన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పళ్ళ బురుసు' చిత్రం అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్త నిర్మాణంలో ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అంతరిక్షంలో ప్రసవం.. సురక్షితమేనా..?




మనుషులు విశ్వాంతరాళంలో విస్తరించాలనే ఆలోచనతో ఎప్పటి నుంచో పరిశోధనలు చేస్తున్నారు శాస్త్రవేత్తలు. అంగారకుడిపై కాలనీలు, చంద్రునిపై నివాసాల గురించి చర్చ జరుగుతోంది. అయితే, అంతరిక్షంలో మానవ మనుగడ సాగాలంటే అక్కడ పునరుత్పత్తి సాధ్యమేనా? గర్భధారణ, ప్రసవం సురక్షితంగా జరుగుతాయా? అన్న అంశంపై ఇటీవల జరిగిన పరిశోధనలు దిగ్భ్రాంతి కలిగించే విషయాలను వెల్లడించాయి.

అంతరిక్షంలో..

'రిప్రొడక్టివ్ బయోమెడిసిన్ ఆన్‌లైన్' జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం ప్రకారం.. ప్రస్తుత పరిస్థితుల్లో అంతరిక్షంలో ప్రసవం ఏమాత్రం సురక్షితం కాదు. భూమికి దూరంగా, అనంతవాయువుల మధ్య ఉండే వాతావరణం మానవ పునరుత్పత్తి వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రధాన అడ్డంకులు ఏంటి..?

అంతరిక్షంలో ఉండే శక్తివంతమైన కాస్మిక్ కిరణాలు మన కణాల్లోని జన్యువులను దెబ్బతీస్తాయి. ఇది పురుషుల్లోని శుక్రకణాలను, మహిళల్లోని అండాలను బలహీనపరుస్తుంది. ఫలితంగా పిండం ఎదుగుదల ఆగిపోవడం లేదా జన్యుపరమైన లోపాలు తలెత్తే ప్రమాదం ఉంది.

సూక్ష్మ గురుత్వాకర్షణ ..

భూమిపై ఉండే గురుత్వాకర్షణ శక్తి పిండం అభివృద్ధికి, గర్భాశయంలో శిశువు స్థితికి ఎంతో కీలకం. శూన్యంలో పిండం ఎదుగుదల ఎలా ఉంటుందనే దానిపై జంతువులపై జరిపిన ప్రయోగాలు మిశ్రమ ఫలితాలను ఇచ్చాయి. ఒత్తిడి - రిథమ్.. అంతరిక్ష ప్రయాణాల్లో కలిగే మానసిక ఒత్తిడి, నిద్ర వేళల్లో మార్పులు హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి.

పునరుత్పత్తి వ్యవస్థపై ప్రభావం..

సుదీర్ఘకాలం అంతరిక్షంలో గడిపే వ్యోమగాముల్లో సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గే అవకాశం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. రేడియేషన్ ప్రభావం వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ వచ్చే ముప్పు కూడా పొంచి ఉంది. తక్కువ కాలం ప్రయాణించే వారిపై పెద్దగా ప్రభావం ఉండకపోయినప్పటికీ.. అక్కడే నివాసం ఉండాలనుకునే వారికి మాత్రం ఇది పెను సవాలే.

అంతరిక్షంలో మానవ కాలనీలు ఏర్పాటు చేయడం సాంకేతికంగా సాధ్యమే కావొచ్చు. కానీ, ఒక ప్రాణం భూమికి వెలుపల సురక్షితంగా జన్మించగలదా? అన్న ప్రశ్నకు సైన్స్ వద్ద ఇంకా పూర్తిస్థాయి సమాధానం లేదు. దీనిపై మరిన్ని లోతైన పరిశోధనలు జరగాల్సి ఉంది.

గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.

# 11 ఏళ్లకే సోషల్ మీడియా అలవాటైందా? 16 ఏళ్లకల్లా ఏం జరుగుతుందో తెలుసా?



చిన్న వయసులో సోషల్ మీడియా వాడకంపై అధ్యయనం

11-12 ఏళ్లకే అకౌంట్ తెరిచినవారిలో చదువులో స్కోర్లు తక్కువ

15-16 ఏళ్లకు గణితంలో మరింత పెరిగిన వ్యత్యాసం

ఆ తేడా ఆరు నెలల విద్యకు సమానమని అంచనా

పదేపదే ఫోన్ చూడటం ఏకాగ్రతను దెబ్బతీయొచ్చని హెచ్చరిక

అకౌంట్ తెరవడం ఆలస్యం చేయడం మంచిదని పరిశోధకుల సూచన

చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. క్షణాల్లో ప్రపంచం పిల్లల ముందుకొచ్చేస్తోంది. రీల్స్.. చాటింగ్.. నోటిఫికేషన్లు.. లైక్‌లు.. ఇలా సోషల్ మీడియా వారి రోజువారీ జీవితంలో భాగమైపోయింది. అయితే పిల్లలను సోషల్ మీడియాలోకి ఎప్పుడు అనుమతించాలన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. చిన్న వయసులోనే ఈ అలవాటు మొదలైతే చదువుపై ప్రభావం పడొచ్చని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది.

11 ఏళ్లకే మొదలైతే..

ఇటలీలో ఐదు వేల మందికిపైగా విద్యార్థులపై ఈ పరిశోధన జరిగింది. 11, 12 ఏళ్లకే సోషల్ మీడియా అకౌంట్ తెరిచిన పిల్లల పరీక్ష ఫలితాలను.. 14 ఏళ్ల తర్వాత అకౌంట్ తెరిచిన వారితో పోల్చారు. 13-14 ఏళ్ల వయసులోనే గణితం, ఇటాలియన్ భాషలో వీరి స్కోర్లు తక్కువగా కనిపించాయి.

ఆరు నెలల చదువు తేడా!

15-16 ఏళ్లకు చేరేసరికి ఈ వ్యత్యాసం మరింత స్పష్టమైంది. ముఖ్యంగా గణితంలో తేడా పెరిగింది. ఇటాలియన్ భాషలోనూ ప్రభావం కనిపించింది. మొత్తం వ్యత్యాసం దాదాపు ఆరు నెలల పాఠశాల విద్యకు సమానంగా ఉందని పరిశోధకులు అంచనా వేశారు. అయితే సోషల్ మీడియా వాడకమే దీనికి నేరుగా కారణమని అధ్యయనం నిరూపించలేదు.

అసలు సమస్య ఇదే..

ఫోన్‌ను ఎంతసేపు వాడుతున్నారనే దానికంటే.. ఎన్నిసార్లు చెక్ చేస్తున్నారన్నది ముఖ్యమని పరిశోధకులు చెబుతున్నారు. నోటిఫికేషన్లు, మెసేజ్‌లు, లైక్‌ల కోసం పదేపదే ఫోన్ చూడటం ఏకాగ్రతను దెబ్బతీయొచ్చు. చదువుతున్న సమయంలోనూ దృష్టి సోషల్ మీడియా వైపు మళ్లుతుంది. దీంతో ఎక్కువసేపు ఒక విషయంపై దృష్టి పెట్టడం కష్టమవుతుంది.

తల్లిదండ్రులు ఇలా చేయండి

పిల్లలకు సోషల్ మీడియాను పూర్తిగా నిషేధించాల్సిన అవసరం లేదని పరిశోధకులు స్పష్టం చేశారు. వీలైతే అకౌంట్ ఇవ్వడాన్ని ఆలస్యం చేయాలి. చదువు, భోజనం సమయంలో ఫోన్‌ను దూరంగా ఉంచాలి. పడకగదిలో ఫోన్‌కు చోటివ్వకపోవడం మంచిది. అవసరం లేని నోటిఫికేషన్లు ఆపేయాలి.

## ఈ లక్షణాలు కనిపిస్తే..

చదువుతున్నప్పుడు పదేపదే ఫోన్ చూడటం, రాత్రిళ్లు నిద్ర మానేసి రీల్స్ చూడటం, ఫోన్ లేకపోతే అసహనానికి గురికావడం వంటి లక్షణాలను తల్లిదండ్రులు గమనించాలి. మార్కులు తగ్గే వరకు వేచి చూడకుండా.. ఏకాగ్రతపై ప్రభావం పడకుండా ముందుగానే అల వాట్లను నియంత్రించడం మంచిది.

# అతి వద్దు సుమీ!



అమ్మాయిలకు అందంపైనా, ఆరోగ్యంపైనా స్పృహ రోజు రోజుకీ పెరుగుతోంది. దీంతో తక్కువ సమయంలోనే బరువు తగ్గాలని కొందరు... దృఢంగా మారిపోవాలని మరికొందరు అతిగా వ్యాయామాలు చేస్తున్నారు. ఇలా చేస్తే ప్రయోజనాల సంగతి దేవుడెరుగు... దుష్ప్రభావాలు తప్పవంటున్నారు నిపుణులు. అది ఎలాంటి పరిస్థితికి దారితీస్తుందో తెలుసా?

ఒత్తిడి పెరుగుతుంది...

వ్యాయామం చేయడం వల్ల ఫీల్‌గుడ్ హార్మోన్లు విడుదలై ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తాయి. అయితే, మితిమీరి వర్కవుట్స్ చేయడం వల్ల కార్టిసాల్ అనే స్ట్రెస్ హార్మోన్ కూడా ఎక్కువగా విడుదలవుతుంది. దీంతో శరీరమే కాదు... మనసూ అలసిపోతుంది. కాబట్టి తీసుకునే ఆహారాన్ని బట్టి రోజూ 45 నిమిషాల నుంచి గంట వరకూ కసరత్తులకు కేటాయించుకుంటే సరిపోతుంది.

ఎక్కువ తినేలా చేస్తుంది...

అధిక వ్యాయామం వల్ల గ్రెలిన్ వంటి ఆకలి హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. దీంతో కసరత్తులతో కరిగించిన కెలొరీలు కంటే ఎక్కువగా ఆహారం తీసుకునేలా చేస్తాయి. దీంతో నాజూగ్గా మారాలన్న లక్ష్యం పక్కకెళ్లి... మరింత బరువు పెరిగే ప్రమాదం ఉంది.

హార్మోన్ల హెచ్చుతగ్గులు...

మితంగా చేసే వ్యాయామం... హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. అదే విశ్రాంతి లేకుండా అతిగా చేస్తే శరీరంపై ఒత్తిడి పెరిగి అవి హెచ్చుతగ్గులకు గురవుతాయి. ముఖ్యంగా కార్టిసాల్ ఎక్కువగా ఉత్పత్తి అయ్యి ఇతర హార్మోన్లను దెబ్బతీస్తుంది. ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ తగ్గుతాయి. నెలసరిని క్రమం తప్పిస్తాయి. భవిష్యత్తులో ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధుల బారిన పడేలానూ చేస్తాయి. కాబట్టి ఆ సమయం గంట దాటకుండా ఉంటే మేలు

# అవసరంలేకున్నా యాంటీబయోటిక్స్ వాడితే ప్రాణాపాయం.. ఐఎంఏ హెచ్చరిక






చిన్నపాటి జ్వరం వచ్చినా, ఒళ్లు నొప్పులు అనిపించినా వెంటనే మెడికల్ షాప్ కి వెళ్లి యాంటీబయోటిక్స్ కొనేస్తున్నారా? అయితే మీకు ప్రాణాపాయం తప్పదు..! యాంటీబయోటిక్స్‌ను విచక్షణారహితంగా వాడటం వల్ల మానవాళికి 'యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్' అనే అదృశ్య ముప్పు పొంచి ఉందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు 'ఇండియన్ మెడికల్ అసోసియేషన్' సహకారంతో దేశవ్యాప్తంగా భారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఏఎంఆర్..

సాధారణంగా శరీరంలోని హానికారక బ్యాక్టీరియాను చంపడానికి యాంటీబయోటిక్స్ వాడతాం. అయితే అవసరం లేకున్నా వాడటం లేదా డాక్టర్ చెప్పిన కోర్సును మధ్యలోనే ఆపేయడం వల్ల సదరు బ్యాక్టీరియా ఆ మందులను తట్టుకునే శక్తిని పెంచుకుంటుంది. ఫలితంగా భవిష్యత్తులో ఆ మందులు శరీరంలో పని చేయవు. చివరకు చిన్నపాటి ఇన్ఫెక్షన్లు కూడా నయం కాక ప్రాణాపాయానికి దారితీస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ఇప్పటికే ాావీ=ను గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించింది.

వినూత్న కార్యక్రమాలు..

ఈ ముప్పును అరికట్టేందుకు 12 రాష్ట్రాల్లోని ప్రతి జిల్లాలోనూ వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలు, నివాస సముదాయాల్లో వైద్యులతో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో భారీ ర్యాలీలు చేపట్టి ప్రజలకు 'ఏఎంఆర్' తీవ్రతను వివరించారు. తప్పుడు మందుల వినియోగం వల్ల చికిత్స విఫలమైన కేసులను ఉదహరిస్తూ నిపుణులు ప్రజలను అప్రమత్తం చేశారు. కేవలం డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే యాంటీబయోటిక్స్ వాడాలని స్పష్టం చేశారు.

ఎ ా ై ద ్ ు య ల ు

ఏమంటున్నారంటే..?

జలుబు, దగ్గు వంటి వైరల్ ఇన్ఫెక్షన్లకు యాంటీబయోటిక్స్ పనిచేయవు. కాబట్టి సొంత వైద్యం వద్దు. డాక్టర్ ఐదు రోజులు మందులు వాడాలని చెబితే, రెండు రోజుల్లో నయం అయిందని ఆపేయకూడదు. దీనివల్ల బ్యాక్టీరియా మందులను తట్టుకునేలా రూపాంతరం చెందుతుంది. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, శుభ్రమైన నీరు తాగడం ద్వారా ఇన్ఫెక్షన్లు రాకుండా చూసుకోవచ్చు. తద్వారా యాంటీబయోటిక్స్ అవసరమే పడదు. ఈ రోజు మనం వాడుతున్న అనాలోచిత యాంటీబయోటిక్స్, రేపటి తరం చికిత్సకు మందులే లేకుండా చేస్తున్నాయి.

గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.

# లేత మనసుకు రీల్స్ షాక్

ఆన్‌లైన్ షార్ట్స్, రీల్స్‌కు దాసోహమవుతున్న పిల్లలు
ఒకదాని వెంట మరొకటి.. గంటలకొద్దీ వీక్షణం
రకరకాల కంటెంట్లు.. భావోద్వేగ హెచ్చుతగ్గులు
నిద్ర, ఆరోగ్యం, చదువుపై తీవ్ర ప్రభావం
వెల్లడిస్తున్న అంతర్జాతీయ అధ్యయనాలు



షార్ట్స్, రీల్స్.. కంటెంట్ ఏదైనా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తున్న వీడియోల వీక్షణం ప్రపంచవ్యాప్తంగా చాలా మందికి వ్యసనంలా దాపురించింది. మాట్లాడటాన్ని మినహాయిస్తే ఒకప్పుడు ఖాళీ సమయాల్లో కొద్దిసేపు వెలిగే మొబైల్ 'తెర'.. ఇప్పుడు గంటలకొద్దీ కాంతిని వెదజల్లుతోంది. ఒకదాని వెంట మరొకటిగా ప్రత్యక్షమయ్యే వీడియోలను విడిచి పెట్టకుండా చూసేస్తున్నారు. అయితే పిల్లలు సైతం ఈ వ్యసనం బారిన పడటం ఆందోళన కలిగిస్తోంది. స్మార్ట్ ఫోన్లలో అందుబాటులో ఉండే యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర యాప్‌లలో అప్‌లోడ్ అవుతున్న ఈ తక్కువ నిడివి వీడియోలు చూడటం నిత్యకృత్యంగా మారింది. డ్యాన్సులు, పాటలు, హాస్యం, నేరాలు, ప్రాంక్ (ప్రాక్టికల్ జోక్స్)..ఇలా అంశం ఏదైనా కోట్లాది షార్ట్ వీడియోలు సోషల్ మీడియాను ముంచెత్తుతున్నాయి. వంటలు చేయడం, పర్యాటక ప్రదేశాలు, ప్రపంచ దేశాలను చుట్టేయడం..వీటన్నిటినీ అప్‌లోడ్ చేసేది కొందరైతే, అవన్నీ చూస్తూ మొబైల్ స్క్రీన్ ముందు ఎంత సమయం గడుపుతున్నదీ తెలియనంతగా జనం లీనమై పోతున్నారు. వీటిల్లో చాలా వీడియోలు పిల్లలకు పనికొచ్చేవి కాదు..వారిని ఉద్దేశించి చేసినవీ కాదు. అయినప్పటికీ కోట్లాది మంది పిల్లలు వీటికి అలవాటుపడ్డారు. భారీ వరదలా ముంచెత్తే కంటెంట్ ప్రవాహం వీరి నిద్రకు అంతరాయం కలిగిస్తోంది. అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది. చదువులపై ప్రభావం చూపిస్తోంది. స్మార్ట్‌ఫోన్ యూజర్లు ప్రతిరోజూ ప్రపంచవ్యాప్తంగా 40 వేల కోట్ల యూట్యూబ్ షార్ట్స్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వీక్షిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

నియంత్రణ కోల్పోయి..

సాధారణంగా 15ఉ90 సెకన్ల వ్యవధితో ఉండే ఈ చిన్న వీడియోలు మెదడు ఎప్పటికప్పుడు కొత్తదనం కోరుకునేలా రూపొందాయి. స్వైప్ చేసిన ప్రతిసారీ కొత్త వీడియో దర్శనమిస్తుంది. ఇంకేముంది.. స్క్రీన్‌తోనే తెల్లవారుతోంది.. అదే స్క్రీన్‌తో నిద్రలోకి జారుకుంటున్నారు. లక్ష మంది పాలుపంచుకున్న 71 అధ్యయనాలను విశ్లేస్తే.. పెద్ద ఎత్తున షార్ట్ వీడియోల వీక్షణంతో స్వీయ నియంత్రణ, పని, చదువుపై శ్రద్ధ తగ్గిందని తేలింది. ముఖ్యంగా నిద్రపై తీవ్ర ప్రభావం పడుతోంది.

నిద్రకు దూరం..

షార్ట్ వీడియోలు చూసే వారు సరిపడా నిద్రకు దూరమవుతున్నారు. చాలామంది పిల్లలు నిద్రకు ఉపక్రమించే ముందు మొబైల్స్‌లో విహరిస్తున్నారు. వేగవంతమైన కంటెంట్‌లో ఉండే భావోద్వేగ హెచ్చు తగ్గులు మెదడుకు ప్రశాంతత లేకుండా చేస్తాయి. నిద్రపోవడం కష్టమవుతుంది. మరో అధ్యయనం ప్రకారం అధికంగా షార్ట్ వీడియోల వీక్షణంతో కొంతమంది టీనేజర్లు పేలవమైన నిద్ర, బిడియం, ఆందోళనకు గురి అవుతున్నట్టు వెల్లడైంది.

హెచ్చరిక లేకుండానే ప్రత్యక్షం

స్వీయ నియంత్రణ విషయంలో చిన్నపిల్లల్లో తక్కువ పరిణతి ఉంటుంది. పైగా చాలావరకు సున్నిత మనసు?కలు. దీంతో త్వరితగతిన భావోద్వేగానికి గురవుతున్నారు. పిల్లలు ఎప్పుడూ చూడకూడని కంటెంట్ సైతం దర్శనమీయడం ప్రమాదానికి కారణం అవుతోంది. పిల్లల ప్రమేయం లేకుండానే వీడియోలు ఒకదాని తర్వాత ఒకటి ఆటోప్లే అవుతుంటాయి. హింసాత్మక, హానికరమైన చాలెంజ్‌లు, లైంగిక కంటెంట్ సైతం తెరపై ప్రత్యక్షమవుతుంటుంది. గంటల నిడివిగల వీడియోలు, సంప్రదాయ సోషల్ మీడియా పోస్టులకు భిన్నంగా షార్ట్ వీడియోలు ఎటువంటి హెచ్చరిక ప్రదర్శించవు. దీంతో భావోద్వేగ పరంగా సిద్ధం కావడానికి ఎలాంటి అవకాశమూ ఉండదు.

భావోద్వేగాలను ఎదుర్కోవడానికి..

కంటెంట్, సౌండ్‌లో ఆకస్మిక మార్పు, భావోద్వేగపరమైన హెచ్చుతగ్గులు అభివృద్ధి చెందుతున్న మెదడులకు ఇబ్బంది కలిగిస్తుంది. అందరు పిల్లలపై ప్రతికూల మానసిక ప్రభావం చూపనప్పటికీ.. ఆందోళన, శ్రద్ధ వహించడంలో ఇబ్బందులు, భావోద్వేగ అస్థిరత ఉన్నవారు మానసిక స్థితిలో మార్పులకు ఎక్కువగా గురవుతారు. అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) ఉన్నవారు ప్రధానంగా వేగవంతమైన కంటెంట్ వైపు ఆకర్షితులవుతారు. బెదిరింపులకు గురైన వారు, ఒత్తిడి, కుటుంబ అస్థిరత, పేలవమైన నిద్రతో బాధపడుతున్న పిల్లలు కష్టమైన భావోద్వేగాలను ఎదుర్కోవడానికి రాత్రి సమయంలో షార్ట్ వీడియోలను చూస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

నైపుణ్యాలు బలహీనం..

సంబంధాల నిర్మాణం, విసుగును తట్టుకోవడం, అసౌకర్య భావాలను ఎదుర్కోవడం బాల్యంలో నేర్చుకుంటారు. అలాంటిది ఎక్కువగా శీఘ్ర వినోదానికి అలవాటు పడిపోయినప్పుడు.. పిల్లలు కలలు కనడం, ఆటలు, కుటుంబంతో ముచ్చటించడం లేదా వారి సొంత ఆలోచనల్లో విహరించడం వంటి అవకాశాలను కోల్పోతారు. బడి నుంచి ఇంటికి వచి?చన తర్వాత ఖాళీ సమయంలో లేత మనసులు తమను తాము ఉల్లాసపర్చుకోవడం, అంతర్గత దృష్టిని పెంపొందించు కోవడం వంటివి చేయాలి. అది కరువైతే నైపుణ్యాలు బలహీన పడతాయని నిపుణులు చెబుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

### తల్లిదండ్రులు ఏం చేయాలి..

నిద్ర, ఆఫ్‌లైన్ కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలి. ఆరు బయట క్రీడలు, పఠనం, అభిరుచులను ప్రోత్సహించాలి. కంటెంట్, ఆన్‌లైన్ అనుభవాల గురించి పిల్లలతో చర్చించి అవగాహన కల్పించాలి. డిజిటల్ ప్రయోజనాలు, స్క్రీన్ వీక్షణ ప్రభావాల గురించి వివరించాలి.

# కర్మ యోగం... కర్తవ్య పాలన



భారతీయ జీవన దర్శనం ప్రకారం ఈ జగత్తంతా దైవమయం. మనం చేసే ప్రతి కర్మను ఆ పరమాత్మకు అర్పించే 'నైవేద్యం'గా భావించాలి. ఉపనిషత్తులు బోధించిన సూత్రం ప్రకారం, కర్మలను చేస్తూనే వాటి ఫలితాలకు అంటకుండా ఉండటమే జీవన ముక్తి. అహంకారాన్ని వీడి, 'నేను కర్తను కాదు, కేవలం ఒక నిమిత్త మాత్రుడను' అనే భావనతో పని చేసినప్పుడు ఆ కర్మకు పుణ్యపాపాలు అంటవు. ఆర్ష ధర్మం ప్రతిపాదించిన అదుతే జీవన వేదాంతం కర్మయోగం. లోకంలో జన్మించిన ప్రతి మానవుడు కర్మ చేయక తప్పదు. అయితే, ఆ కర్మను బంధనంగా మార్చుకోవాలా లేక మోక్ష మార్గంగా మలచుకోవాలా అన్నదే ఇక్కడి అసలైన ప్రశ్న. భగవద్గీతలో క ృష? పరమాత్మ అందించిన 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అనే దివ్య శ్లోకం మానవాళికి ఒక శాశ్వత దిక్సూచి. పని చేయడంపైనే నీకు అధికారం ఉంది గానీ, ఫలితంపై లేదని చెప్పడం వెనుక లోతైన మనస్తత్వ శాస్త్రం దాగి ఉంది. ఫలితంపై అతిగా ఆశ పెంచుకున్నప్పుడు మనిషిలో ఆందోళన, భయం, అసహనం ప్రవేశిస్తాయి. అదేపనిని దైవ కార్యంగా భావించి చేసినప్పుడు ఆ కర్మ 'యోగం'గా మారుతుంది. ఇది కేవలం సిద్ధాంతం కాదు, నిత్య జీవితంలో అనుసరించదగిన పరమ సత్యం. కర్మయోగం అంటే పలాయనవాదం కాదు, అది సంపూర?మైన క్రియాశీలత. ఒక శిల్పి విగ్రహాన్ని చెక్కుతున్నప్పుడు కేవలం ఆ ప్రతిమ ఎంత ధరకు అమ్ముడవుతుందనే ఆలోచనతో ఉంటే, ఆ శిల్పంలో జీవం ఉట్టిపడదు. అదే శిల్పి తన నైపుణ్యాన్ని పరమాత్మకు అర్పిస్తున్నాననే భావనతో చెక్కితే, ఆ పనిలో ఒక అలౌకికానందం వెల్లివిరుస్తుంది. అలాగే ఒక వైద్యుడు కేవలం ధనం కోసమే చికిత్స చేస్తే అది వ్యాపారం అవుతుంది. అదే వైద్యుడు రోగిలో దైవాన్ని చూస్తూ, తన విజ్ఞానాన్ని ప్రాణదానానికి అంకితం చేస్తే అది పవిత్ర యజ్ఞమవుతుంది. ఫలితం భగవంతుడి నిర?యమని నమ్మి, తన శక్తినంతా చికిత్సపైనే కేంద్రీకరించినప్పుడు ఆ వైద్యుడికి మానసిక ఒత్తిడి ఉండదు. ఈ నిష్కామ బుద్ధి మనిషిని నిరంతరం ఉన్నత స్థితిలో నిలబెడుతుంది. అగ్ని తన ధర్మాన్ని తాను నిర్వర్తించినట్లు, మనిషి తన స్వధర్మాన్ని నిష్కామంగా ఆచరించాలి. ఈ మార్గంలో అత్యంత ముఖ్యమైనది 'ఫలత్యాగం'. అంటే ఫలితాన్ని వదిలేయడం కాదు, ఫలితం వల్ల కలిగే హర్ష విచారాలకు అతీతంగా ఉండటం. విజయం వస్తే పొంగిపోకుండా, అపజయం ఎదురైతే కుంగిపోకుండా ఉండే స్థితి కర్మయోగికి మాత్రమే సాధ్యం. యోగశాస్త్రం బోధించిన ఈ నిష్కామ కర్మ సిద్ధాంతం వ్యక్తిని కర్తవ్యోన్ముఖుడిని చేస్తుంది. చేసే పనిలో దైవత్వాన్ని వెతుక్కున్నప్పుడు ఒత్తిడి మాయమై శాంతి ప్రవహిస్తుంది. ప్రతి క్షణం మన కర్మను ఒక ఆరాధనగా మలుచుకుంటే, ఈ ప్రపంచమే ఒక వైకుంఠమవుతుంది. స్వార్థపు చీకటిని తొలగించి, సేవా భావం అనే జ్యోతిని వెలిగించుకుందాం. సర్వం ఈశ్వరార్పణమస్తు! నిప్పు నిప్పును కాల్చదు గానీ, దానిపై పడిన వస్తువును కాలుస్తుంది. అలాగే, అహంకారంతో చేసే కర్మలు బంధాలను స ృష్టిస్తే, నిరహంకారంతో చేసే కర్మలు మనసును నిర్మలం చేస్తాయి. సూర్యుడు ప్రతిరోజూ లోకానికి వెలుగును ఇస్తాడు, తనే వెలుగునిస్తున్నాననే అహంకారం ఆయనకు ఉండదు. అటువంటి నిస్వార్థ గుణమే మనల్ని మహోన్నతులుగా తీర్చిదిద్దుతుంది. నిత్య జీవిత సవాళ్లను సాకులు చెప్పకుండా ఎదుర్కోవడం, బాధ్యతలను భారం కాకుండా గౌరవంగా భావించడం కర్మయోగపు అంతరార్థం. ఈ జ్ఞానమే మనల్ని నిరంతరం కర్మపథంలో నడిపిస్తూ, అంతిమంగా ఆత్మానందానికి చేరువ చేస్తుంది.

# ప్రశాంత జీవన సూత్రం



సముద్ర తీరాన నిలబడినప్పుడు ఒక్కొక్కరి స్పందన ఒక్కోలా ఉంటుంది. ఒకరు అలల హోరును చూసి భయపడితే, మరొకరు పాదా లను తడిపే అలల స్పర్శతో పరవశిస్తారు, ఇంకొకరు నీటిపై తేలే రంగురాళ్లను ఏరుకుంటారు. కొందరు విలువైన రత్నాల కోసం లోతుకు వెళ్తారు. తీరాన స్థిరంగా నిలబడి, దేనితోనూ అంటుకోకుండా సముద్ర గమనాన్ని గమనించేవాడే నిజమైన 'ద్రష్ట'. మన ఆలోచనల నుండి మనం విడివడి, వాటిని కేవలం ఒక సాక్షిగా గమనించినప్పుడు, ఆ ఉద్వేగాల తీవ్రత క్రమంగా క్షణించి మనసు ప్రశాంత నిర్మల సాగరమవుతుంది. నదిలో కొట్టుకుపోయేవాడు ప్రవాహ వేగాన్ని కొలవలేడు, తీరాన నిలబడేవాడే దాని లోతును గ్రహించగలడు. జీవితంలో సంభవించే పరిణామాలు కూడా అలల వంటివేబీ అవి మనల్ని తాకవచ్చు గానీ ముంచేయకూడదు. ఈ నిరంతర జాగరూకతే మనల్ని నిలబెడుతుంది. నిశ్చలత్వమే నిత్య సత్యమని గ్రహించినప్పుడే మానవుడు పరిపూర్ణుడు కాగలడు. విశ్వజనీన ధర్మం కేవలం పూజాది క్రతువుల సముచ్చయం కాదుబీ అది అనంతమైన చైతన్య రహస్యాల నిధి. ముండకోపనిషత్తు ఉద్ఘాటించిన 'ద్వా సుపర్ణా సయుజా సఖాయా...' అనే దివ్య మంత్రం మానవ మనస్తత్వానికి ఒక అద్భుత భాష్యం. ఒకే వృక్షంపై నివసించే రెండు పక్షులలో ఒకటి భౌతిక ఫలాలను భుజిస్తూ సుఖదుఃఖాలకు లోనవుతుంటే, రెండవది కేవలం 'సాక్షి'గా వీక్షిస్తూ ఆనందమయంగా ఉంటుంది. లోకంలోని ద్వంద్వాలను అనుభవించేది ఒక పక్షి అయితే, ఆ అనుభవాన్ని నిర్లిప్తతతో గమనించేది మరో పక్షి. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో, ఒత్తిడి కోరల్లో చిక్కుకున్న ఆధునిక మానవుడికి ఈ సాక్షిభావమే అత్యంత ఆవశ్యకమైన సంజీవని. ఆ దివ్య దృష్టిలోనే జగత్తు అసలైన పరమార్థం నిబిడీకృతమై ఉంది. ఈ నిరంతర ఎరుక కలిగిననాడు మనిషి సామాన్య జీవి నుండి దైవత్వపు అంచులకు చేరుకుంటాడు. జ్ఞానాగ్నితో అజ్ఞానాన్ని దహించి, ఆత్మజ్ఞాన సౌరభాన్ని పొందడమే ఆర్ష సంస్కృతి మనకు బోధించే పరమ రహస్యం. మానవ జన్మ ధన్యమవ్వడానికి ఇటువంటి తాత్విక చింతన ఎంతో అవసరం. భగవద్గీతలో కృష్ణ పరమాత్మ బోధించిన 'అసంగత్వమే' ఈ సాక్షిభావం. తామరాకుపై నీటిబొట్టులా సంసారంలో ఉంటూనే, దేనికీ అంటకుండా ఉండటం ఒక దివ్య కళ. 'నేను కోపంగా ఉన్నాను' అని కాకుండా, 'నా మనసులో కోపం అనే తరంగం ఉద్భవించింది' అని గమనించడం ప్రారంభించిన క్షణమే ఆ వికారం ఆవిరైపోతుంది. ఇది పలాయనవాదం కాదుబీ పరిపూర్ణమైన అవగాహనతో కూడిన ప్రశాంత స్థితి. సుఖం వచ్చినప్పుడు అది ఒక అతిథి అని, దుఃఖం సంభవించినప్పుడు అది ఒక తాత్కాలిక మేఘమని భావించాలి. వైదిక విజ్ఞానం మనకు అందించిన ఈ అమోఘమైన దృక్పథం, వ్యక్తిని సమర్థుడిగా, సమాజాన్ని సలక్షణంగా తీర్చిదిద్దుతుంది. ఎక్కడైతే ద్వేషం ఉండదో, ఎక్కడైతే మమకారపు సంకెళ్లు ఉండవో, అక్కడ నిరతిశయమైన శాంతి విరాజిల్లుతుంది. సాక్షిభావంతో జీవించడం నేర్చుకుంటే, ప్రతి రోజూ ఒక ఉత్సవమే, ప్రతి క్షణం ఒక పరమపదమే.

చీకటిని నిందించడం కంటే చిన్న దీపాన్ని వెలిగించడం మేలు అన్నట్లు, కల్లోల ప్రపంచంలో మనశ్శాంతి అనే జ్యోతిని వెలిగించుకుందాం. సర్వం ఆ పరమాత్మ స్వరూపం! లోకాః సమస్తాః సుఖినో భవంతు! మేఘాలు వస్తుంటాయి, పోతుంటాయిబీ ఆకాశం మాత్రం ఎప్పుడూ నిర్మలంగానే ఉంటుంది. మన ఆత్మ ఆ ఆకాశం వంటి నిర్లిప్త స్థితి. ఇటువంటి మానసిక సంస్కారం అలవడినప్పుడు మనిషి ఏ పరిస్థితిలోనూ చెక్కుచెదరని ధైర్యంతో, ప్రశాంతతతో వ్యవహరించగలడు. అంతిమంగా, మన జీవిత నాటకంలో మనం కేవలం పాత్రధారులమే కాదు, ఆ నాటకాన్ని తిలకించే ప్రేక్షకులం కూడా అని గుర్తించడమే పరమ సత్యం. ఈ జ్ఞానమే మనల్ని బంధవిముక్తులను చేసి మోక్షమార్గాన నడిపిస్తుంది. నిష్కామ కర్మ ద్వారానే సిద్ధి కలుగుతుందని పెద్దల మాట.

